నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 22-9-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :27 సంచిక:41 పేజీలు: 4 వెల: రూ.1/-

కొండాలక్ష్మణ్ బాపూజీకి సీఎం కెసిఆర్ నివాళి

ఆయన సేవలను స్మరించుకున్న మంత్రులు

హైదరాబాద్,సెప్టెంబర్21(ఆర్ఎన్ఎ): స్వాతంత్ర్య సమరయోధులు కొండా లక్ష్మణ్ బాపూజీ 8వ వర్ధంతి సందర్భంగా ఆయన సేవలను ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గుర్తు చేసుకున్నారు. బాపూజీ క్విట్ ఇండియా, ముల్కీ వ్యతిరేక ఉద్యమంతో పాటు తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక పోషించారని సీఎం పేర్కొన్నారు. లక్ష్మణ్ బాపూజీ అందించిన సేవలు రాబోయే తరాలకు స్ఫూర్తిదాయకమని సీఎం కేసీఆర్ అన్నారు. మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, నిరంజన్ రెడ్డి కూడా కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమంలో బాపూజీ సేవలను మంత్రులు గుర్తు చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం తన మంత్రి పదవిని తృణప్రాయంగా వదిలేసిన నిబద్ధత గల రాజకీయవేత్త కొండా లక్ష్మణ్ బాపూజీ అని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. బాపూజీ వర్ధంతి సందర్భంగా వరంగల్ జిల్లాలోని రాయపర్తి మండల కేంద్రంలో బాపూజీ చిత్రపటానికి మంత్రి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ..స్వరాష్ట్ర సాధన, బడుగు బలహీనవర్గాల అభివృద్ధి కోసం బాపూజీ ఎన్నో ఉద్యమాలు చేశారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ కార్యాలయ ఏర్పాటుకు తాను ఉంటున్న జలదృశ్యాన్ని అప్పగించిన మహోన్నత వ్యక్తిగా కొండా లక్ష్మణ్ బాపూజీ చరిత్రలో నిలిచిపోతారన్నారు. వారితో తెలంగాణ ఉద్యమంలో పాలుపంచుకోవడం నా అదృష్టంగా భావిస్తున్నానని మంత్రి తెలిపారు. బడుగు వర్గాల అభ్యున్నతి కోసం, తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం రాజీలేకుండా పోరాడిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి పిలుపునిచ్చారు. లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా నిర్మల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వెనకబడిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో జన్మించి రాజకీయంగా, సామాజికంగా ఎత్తుపల్లాలను చవిచూసిన బాపూజీ ఉద్యమాలే ఊపిరిగా తన జీవితాన్ని సమాజానికి అంకితం చేశారని కొనియాడారు. ఆయన విలక్షణ జీవితశైలి ప్రతి ఒక్కరికి అనుసరణీయమని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం బాపూజీ ఆశయాల సాధన కోసం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడుతుందని అన్నారు.

పలు జిల్లాలకు భారీ వర్షసూచన

అప్రమత్తం చేసిన అధికారులు

కృష్ణాకు కొనసాగుతున్న వరద

హైదరాబాద్,సెప్టెంబర్21(ఆర్ఎన్ఎ) :ఈశాన్య బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం మరింత బలపడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీనికి అనుబంధంగా 3.1 కి.మీ. నుంచి 7.6 కి.మీ. ఎత్తువరకు ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నది. ఈ ప్రభావంతో రాష్ట్రంలోని కొన్ని చోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. అదేవిధంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనూ గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన తేలికపాటి జల్లులు కురుస్తాయని వెల్లడించింది. తెలంగాణ రాష్ట్రంలో కొన్ని ప్రాంతాలలో ముఖ్యంగా ఉమ్మడి అదిలాబాద్, కరీంనగర్ , నిజామాబాద్ , వరంగల్ , ఖమ్మం జిల్లాలలో భారీగా, అతి భారీగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. వర్షాల వలన వరదలు, లోతట్టు ప్రాంతాలలో నీరు నిలిచే అవకాశం ఉంది. వర్షాల వలన వరదలు సంభవించడం తో పాటు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యే అవకాశం ఉంది. చెట్లు, ఎలక్ట్రిక్ పోల్స్, పడిపోవడం వలన సాధారణ కార్యకలపాలకు అంతరాయం ఏర్పడుతుంది, రిజర్వయర్లు , చెరువులు, కుంటలు నిండి పొంగి పోవటం వలన లోతట్టు ప్రాంతాలలో, చిన్న బ్రిడ్జిలు , కాజివేలలో నీరు ప్రవహించే అవకాశం ఉంది. ట్రాఫిక్ అంతరాయలు, ప్రజలకు ఇబ్బంది ఏర్పడే అవకాశం ఉంది. జిల్లా యంత్రంగం మొత్తం అప్రమత్తంగా ఉండి . ఇంతకు ముందే జారీ చేసిన ఫ్లడ్ ప్రోటోకాల్ తప్పని సరిగా ఫాలో కావాలని జిల్లా కలెక్టర్లను ఇప్పటికే కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ కూడా ఆదివారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్‌తో సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కలెక్టర్లను, ఎస్.పి.లను అప్రమత్తంగా ఉండాలని పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనించాలని సీఎం కోరారు. అన్ని శాఖల అధికారులు జిల్లా కేంద్రంలో అందుబాటులో ఉండి ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కృష్ణాకు కొనసాగుతున్న వరద

కుండపోత వర్షాలకు కృష్ణానదికి వరద స్థిరంగా కొనసాగుతోంది. ఇప్పటికే నదిపై అన్నీ ప్రాజెక్టులు నిండటంతో వస్తున్న ఇన్ఎ÷–లోను దిగువకు విడుదల చేస్తున్నారు. సోమవారం ఉదయానికి జోగులాంబ గద్వాల జిల్లాలోని జూరాల ప్రాజెక్టుకు 1,63,000 క్యూసెక్కుల వరద వస్తోంది. 20 గేట్లను ఎత్తి 1,67,835 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాల పూర్తిస్థాయి నీటిమట్టం 1045 అడుగులు 9.657 (టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1043 అడుగులు (8.830 టీఎంసీలు)గా ఉంది. శ్రీశైలం జలాశయానికి 1,74,869 క్యూసెక్కుల ఇన్ఎ÷–లో ఉంది. జలాశయం గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 885 అడుగులు (215.8 టీఎంసీ)లు కాగా ప్రస్తుతం 884.2 అడుగులు (210.9) టీఎంసీలుగా ఉంది. ప్రాజెక్టు 10 గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 3,16,033 క్యూసెక్కులు, కుడిగట్టు కేంద్రంలో విద్యుదుత్పత్తి ద్వారా 13,076 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. నిన్నటితో పోలిస్తే నాగార్జున సాగర్‌కు కాస్త ఇన్ఎ÷–లో తగ్గింది. ఎగువ నుంచి 1,61,499 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. అధికారులు 8 గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 1,61,499 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జున సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు(312.4 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 589.10 అడుగులు (309.35 టీఎంసీలు) గా ఉంది.

అగ్రి బిల్లుపై రైతులు ఎందుకు సంతసించడం లేదు

–కేంద్ర బిల్లుపై మండిపడుతూ ట్వీట్ చేసిన కెటిఆర్

హైదరాబాద్,సెప్టెంబర్21(ఆర్ఎన్ఎ): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అగ్రికల్చర్ బిల్లులు చారిత్రాత్మకమే అయితే రైతులు ఎందుకు సంబురాలు చేసుకోవడం లేదని అని రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు. ఎన్‌డీఏ భాగస్వామ్య పక్షాలు ఎందుకు రాజీనామా చేస్తున్నాయని కేటీఆర్ అడిగారు.

గత వారంలో కొత్త రెవెన్యూ బిల్లును తెలంగాణ అసెంబ్లీ ఆమోదించినప్పుడు రైతులంతా సంతోషంగా ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులందరూ ఆనందంలో మునిగిపోయారని కేటీఆర్ గుర్తు చేశారు. తాము రైతు స్నేహపూర్వక రెవెన్యూ బిల్లును ప్రవేశపెట్టామని కేటీఆర్ తెలిపారు. రైతులకు మేలు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కొత్త రెవెన్యూ బిల్లును ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఈ బిల్లుకు తెలంగాణ అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభించే దిశగా ఈ చట్టాన్ని రూపొందించారు. ధరణి పోర్టల్ ద్వారా అత్యంత పకడ్బందీగా భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అవినీతికి ఆస్కారం లేకుండా, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా సీఎం కేసీఆర్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న విషయం తెలిసిందే. రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులేస్తోందన్నారు.

చరిత్రలో నేటినిజం

కం॥ ప్రతి వాడి భయం కడుపై
ప్రతి కవితలో ఆనవుగు ప్రత్యేకతలో
స్థిర మతియై అందు కొనెను
చేతురుంకగ "శ్రీనివాస" శక్తి తిక్కనకే !!

(సెప్టెంబర్ 22 గాయకుడు పీ.బీ. శ్రీనివాస్ జయంతి..) –రాధశ్రీ

సెల్: 9494481210



'ధరణి' పోర్టల్‌పై రేపు సీఎం కేసీఆర్ సమీక్ష

హైదరాబాద్ సెప్టెంబర్ 21: నూతన రెవెన్యూ చట్టంలో భాగంగా తీసుకువస్తున్న ధరణి పోర్టల్‌పై ముఖ్యమంత్రి కేసీఆర్ మంగళవారం సమీక్ష నిర్వహించనున్నారు. ధరణి పోర్టల్ రూపకల్పనపై రేపు మధ్యాహ్నం 2 గంటలకు ప్రగతి భవన్‌లో ఉన్నతాధికారులతో ఉన్నత స్థాయి సమావేశం జరగనుంది. ఈ పోర్టల్ రూపకల్పనకు సమగ్ర సమాచారంతో రావాలని అధికారులను సీఎం ఆదేశించారు. రెవెన్యూ సంస్కరణల్లో భాగంగా రెవెన్యూ రికార్డులను పారదర్శకంగా నిర్వహించడానికి ధరణి పోర్టల్ రూపకల్పన జరగాలని సీఎం కేసీఆర్ ఆకాంక్షించారు.

పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు

న్యూఢిల్లీ,సెప్టెంబర్21(ఆర్ఎన్ఎ): దేశంలోని పలు రాష్ట్రాల్లో వర్షాలు దంచికొడుతున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో వరదలు సంభవిస్తున్నాయి. కేరళ, ఒడిశా తదితర రాష్ట్రాల్లో ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తున్నాయి. అయితే ఢిల్లీ–ఎన్సీఆర్, బీహార్, పంజాబ్ రాష్ట్రాల్లో వేడి వాతావరణంతో ప్రజలు అవస్థల పాలవుతున్నారు. ఈ రాష్ట్రాల్లో త్వరలో వర్షాలు కురవనున్నాయని భారత వాతావరణశాఖ తెలిపింది. కేరళలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఎడతెరిఎ లేకుండా వర్షాలు కురిసిన నేపథ్యంలో రాష్ట్రంలోని 8 జిల్లాలకు వాతావరణ విభాగం రెడ్ అలెర్ట్ జారీ చేసింది. డిశా, ఉత్తరాఖండ్‌లలోని పలు జిల్లాలలో కూడా రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురవనున్నాయని హెచ్చరించింది. ఢిల్లీ–ఎన్సీఆర్‌లో ఈనెల 23, 24 తేదీలలో వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. కాగా తమిళనాడులోని పిల్లూర్ డ్యామ్ నుంచి వరద నీటిని విడుదల చేసిన నేపథ్యంలో మెట్టుపలయంతో పాటు సమీప ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ విభాగం హెచ్చరించింది. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరదలు సంభవించే ప్రమాదం ఉందని తెలిపింది.

గురజాడ రచనలు అభ్యుదయం వైపు నడిపించాయి

ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు నివాళి

న్యూఢిల్లీ,సెప్టెంబర్21(ఆర్ఎన్ఎ): అభ్యుదయ కవి గురజాడ అప్పారావు సాంఘిక పరివర్తన కోసం పరితపించారని ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. ఆయన రచనలు అభ్యుదయం దిశగా బాటలు వేశాయని పేర్కొన్నారు. దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్ అంటూ తమ రచనల ద్వారా సాంఘిక పరివర్తన కోసం పరితపించిన అభ్యుదయ కవి గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా ఆయన స్మృతికి వెంకయ్య నివాళులు అర్పించారు. గురజాడ వారి కలం నుంచి జాలువారిన కన్యాశుల్కం, పూర్ణమ్మ, ముత్యాలసరాలు, దిద్దుబాటు వంటి రచనలు అభ్యుదయం దిశగా బాటలు వేశాయి. ప్రజలందరికీ అర్థమయ్యే జీవభాషలో గురజాడ వారు సాగిన అడుగుజాడలు ప్రతి ఒక్కరికీ ఆదర్శం కావాలని ఆకాంక్షిస్తున్నానని వెంకయ్యనా యుడు పేర్కొన్నారు.

రాజ్యసభలో సభ్యుల తీరు ఆక్షేపణీయం

మండిపడ్డ కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్

న్యూఢిల్లీ,సెప్టెంబర్21(ఆర్ఎన్ఎ): రాజ్యసభలో కేంద్రం వ్యవసాయ బిల్లులు ప్రవేశ పెట్టిన సమయంలో విపక్ష సభ్యులు ప్రవర్తించిన తీరుపై రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మండిపడ్డారు. రైతులను గందరగోళానికి గురి చేయాలనే ఉద్దేశంతోనే ప్రతిపక్ష నేతలు డ్రామా చేశారన్నారు. తాను కూడా రైతునని చెప్పిన రాజ్‌నాథ్.. ప్రభుత్వం రైతులను బాధ పెడుతుందని ఎప్పుడూ నమ్మొద్దన్నారు. హింసాత్మక రీతిలో ప్రవర్తించడం, కుర్చీలు ఎక్కడం, చెయిర్స్‌తోపాటు మైకులను విరగ్గొట్టడం సరైంది కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'డిప్యూటీ చైర్మన్‌తో అలా వ్యవహరించడం బాధాకరం. ఆయన చెయిర్ దగ్గరకు వెళ్లి, రూల్‌బుక్‌ను చించి వేయడం సరికాదు. ఇలాంటి ఘటన రాజ్య సభ లేదా లోక్ సభ చరిత్రలో మునుపెన్నడూ జరగలేదు. సదరు నేతలు పార్లమెంట్ గౌరవానికి భంగం వాటిల్లేలా ప్రవర్తించారు' అని రాజ్‌నాథ్ చెప్పారు. కేంద్రం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కొత్త వ్యవసాయ బిల్లుల్లో కీలకమైన రెండు బిల్స్ రాజ్య సభలో మూజువాణి ఓటుతో ఆదివారం ఆమోదం పొందాయి. ఈ బిల్లులు ప్రవేశపెట్టిన సమయంలో వీటికి వ్యతిరేకంగా విపక్ష సభ్యులు నినాదాలు చేస్తూ స్పీకర్ పోడియం దగ్గరకు దూసుకెళ్లారు. దీంతో క్రమశిక్షణ చర్యల కింద ఎనిమిది మంది సభ్యులను వారం రోజుల పాటు సస్పెండ్ చేశారు.

డిప్యూటి ఛైర్మన్‌పై దాడి ఘటన

రాజ్యసభ నుంచి 8మంది ఎంపిల సస్పెన్షన్

సభ్యుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఛైర్మన్ వెంకయ్య

సభలోనే ఆందోళనకు దిగిన సస్పెండెడ్ సభ్యులు

రాజ్యసభ కార్యకలాపాలకు అంతరాయం..వాయిదా

న్యూఢిల్లీ,సెప్టెంబర్21(ఆర్ఎన్ఎ): వ్యవసాయ బిల్లుపై ఓటింగ్ సందర్భంగా రాజ్యసభలో దురుసుగా ప్రవర్తించిన ఎనిమిది మంది రాజ్యసభ సభ్యులపై వేటు పడింది. వారిని వారం రోజుల పాటు సస్పెన్షన్ చేస్తున్నట్లు రాజ్యసభ ఛైర్మన్ వెల్లడించారు. రాజ్యసభలో పోడియం వైపునకు దూసుకెళ్లడం, వ్యవసాయ బిల్లు కాపీలను చింపి గాల్లోకి విసిరేయడ వంటి చర్యలకు దిగిన సభ్యులపై ఛైర్మన్ ఎం వెంకయ్య నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిని వారంరోజుల పాటు సస్పెండ్ చేస్తూ నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ మేరకు వ్యవసాయ బిల్లులను వ్యతిరేకిస్తూ రాజ్యసభలో ఆందోళన చేపట్టిన విపక్ష ఎంపీలపై చైర్మన్ వెంకయ్యనాయుడు చర్య తీసుకున్నారు. డెరిక్ ఓబ్రెయిన్‌తో పాటు 8 మంది సభ్యులపై రాజ్యసభ సస్పెన్షన్ విధించింది. ఆదివారం రాజ్యసభలో జరిగిన ఘటనను ఆయన గుర్తు చేస్తూ విపక్ష ఎంపీలు సోషల్ డిస్టాన్స్, కోవిడ్ నిబంధనలు విస్మరించారన్నారు. రాజ్యసభకు నిజంగా అది బ్యాడ్ డే అన్నారు. కొందరు సభ్యులు వెల్‌లోకి దూసుకువచ్చారని, డిప్యూటీ చైర్మన్‌పై పేపర్లు, రూల్ బుక్‌ను విసిసిరనట్లు చైర్మన్ వెంకయ్య నాయుడు తెలిపారు. బెంచ్‌లపై డ్యాన్సులు చేయడం, పేపర్లు విసిరేయడం రాజ్యాంగ విరుద్ధమని, ఇదేమైనా పార్లమెంటరీ మర్యాదనా అని ఆయన నిలదీశారు. ఓ దశలో డెరిక్ ఓబ్రెయిన్‌పై వెంకయ్య ఫైర్ అయ్యారు. సభ నుంచి బయటకు వెళ్లిపోవాలంటూ ఆదేశించారు. ఆదివారం రోజున మార్షల్స్ రాకుంటే.. డిప్యూటీ చైర్మన్‌పై విపక్ష సభ్యులు దాడి చేసేవారన్నారు. మనమే సాధారణ ప్రజలకు నిబంధనల గురించి వివరిస్తుంటామని, మనమే ఆ నిబంధనలను పాటించకుంటే ఎలా అన్నారు. డిప్యూటీ చైర్మన్‌ను భౌతికంగా బెదిరించారన్నారు. ఇకపోతే డిప్యూటీ చైర్మన్ హరినారాయణపై విపక్ష సభ్యులు ప్రవేశపెట్టిన తీర్మానం చెల్లదని వెంకయ్య ప్రకటించారు. 90 సీ నిబంధన ప్రకారం డిప్యూటీ చైర్మన్‌పై నోటీసు ఇవ్వడానికి 14 రోజుల గడువు ఇవ్వాలని, ప్రతిపక్షనేతతో పాటు ఇతర సభ్యులు ఇచ్చిన నోటీసులు చెల్లదని చైర్మన్ వెంకయ్య తెలిపారు. దీంతో విపక్ష సభ్యులు ఇచ్చిన అవిశ్వాస తీర్మానం నోటీసులు సరైన రీతిలో లేదని తిరస్కరించారు. అనంతరం పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి మురళీధరన్.. 8 మంది సభ్యులను సభ నుంచి వారం పాటు సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సెషన్ మొత్తం వారిపై వేటు వేస్తున్నట్లు తెలిపారు. డెరిక్ ఓబ్రెయిన్, సంజయ్ సింగ్, రాజీవ్ సతావ్, కేకే రాజేశ్, సయ్యిద్ నజీర్ హుస్సేన్, రిపున్ బోరా, డోలా సేన్, ఇలమారం కరీమ్‌లు ఆ జాబితాలో ఉన్నారు. తృణమూల్ కాంగ్రెస్, కాంగ్రెస్, సీపీఎం ఆమ్ ఆద్మీ పార్టీలకు చెందిన ఎనిమిది సభ్యులు సస్పెన్షన్ వేటు పడిన వారిలో ఉన్నారు. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన డెరెక్ ఒబ్రియాన్, డోలాసేన్, కాంగ్రెస్ సభ్యుడు రాజీవ్ సతవ్, రిపున్ బోరా, సయ్యద్ నాసిర్ హుస్సేన్, ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి సంజయ్ సింగ్, సీపీఎం సభ్యులు కేకే రాగేష్, ఎళమరం కరీమ్‌లను రాజ్యసభ ఛైర్మన్ సస్పెండ్ చేశారు. వారం రోజుల పాటు సభకు హాజరు కావొద్దని ఆదేశించారు. సభ్యులను సస్పెండ్ చేయడం పట్ల తృణమూల్ కాంగ్రెస్ నిరసన వ్యక్తం చేస్తోంది. రాజ్యసభ ఛైర్మన్ వ్యవహరించిన తీరు సరికాదంటూ తృణమూల్ ఎంపీ సుఖేందు శేఖర్ రే మండిపడ్డారు. సభ్యుల సస్పెన్షన్ చట్ట వ్యతిరేకమని విమర్శించారు. వ్యవసాయ బిల్లులో పొందుపరిచిన అనేక అంశాలు, సవరణలను సెలెక్ట్ కమిటీకి పంపించాలంటూ దాదాపు అన్ని ప్రతిపక్ష పార్టీల సభ్యులు సభకు సూచించారని, అయినప్పటికీ.. వాటిని పరిగణనలోకి తీసుకోలేదని అన్నారు. సభ్యులు వ్యతిరేకిస్తోన్న సమయంలో మూజువాణి ఓటుతో బిల్లు ఆమోదం పొందినట్లు ఎలా నిర్ధారించగలరని ప్రశ్నించారు.

ఇకపోతే వివాదాస్పద వ్యవసాయ బిల్లుల నేపథ్యంలో రాజ్యసభలో సస్పెన్షన్ వేటు పడిన ప్రతిపక్ష ఎంపీలు సభ నుంచి బయటికి వెళ్లేందుకు అంగీకరించలేదు. ఎనిమిది మంది ఎంపీలను వారం రోజుల పాటు సస్పెండ్ చేస్తున్నట్టు చైర్మన్ వెంకయ్య నాయుడు ప్రకటించినప్పటికీ... వారంతా సభలోనే ఉండి ఆందోళన కొనసాగించారు. పెద్దపెట్టున నినాదాలు చేస్తూ నిరసన చేపట్టడంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. మరోవైపు సస్పెన్షన్ నిర్ణయంపై ప్రతిపక్ష పార్టీలు తీవ్ర నిరసనకు దిగడంతో.. రెండు గంటల వ్యవధిలో సభ నాలుగు సార్లు వాయిదా పడింది. సస్పెన్షన్ వేటు పడిన ఎంపీలు బయటికి వెళ్లిపోవాలంటూ రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ పలుమార్లు కోరినప్పటికీ.. సభ్యులు పట్టించుకోలేదు. ఆ ఎంపీలు బయటికి వెళ్తేనే ప్రతిపక్ష నాయకుడు మాట్లాడేందుకు అవకాశం ఇస్తానని ఉపసభాపతి స్పష్టం చేశారు. అయితే అందుకు ప్రతిపక్ష సభ్యులు ససేమిరా అనడంతో సభను మరో అరగంట వాయిదా వేస్తున్నట్టు హరివంశ్ ప్రకటించారు. కాగా సస్పెండ్ అయిన ఎంపీలకు సభలో ఉండే హక్కు లేదనీ... సభ్యులు కాని వారు లోపల ఉండగా సభా కార్యకలాపాలు కొనసాగే అవకాశం ఉండదని బీజేపీ ఎంపీ మురళీధరన్ పేర్కొన్నారు.

మహారాష్ట్ర భీవండిలో విషాద ఘటన

భవనం కూలి 8మంది మృతి

ప్రధాని మోదీ సంతాపం

ముంబై,సెప్టెంబర్21(ఆర్ఎన్ఎ): మహారాష్ట్రలోని థానే జిల్లా భీవండిలో విషాద ఘటన చోటుచేసుకుంది. సోమవారం తెల్లవారుజామున మూడు అంతస్తుల భవనం కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో ఎనిమిది మంది మృతి చెందగా శిథిలాల కింద చిక్కుకుపోయిన మరో 20 మందిని స్థానికులు కాపాడారు. సమాచారం అందుకున్న పోలీసులు, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. శిథిలాల కింద ఇంకా ఎంతమంది ఉన్నారన్నది స్పష్టంగా తెలియరాలేదు. భీవండీ పట్టణంలోని పటేల్ కాంపౌండ్ ప్రాంతంలో 1984లో ఈ భవనాన్ని నిర్మించినట్లు స్థానికులు తెలిపారు. భవనంలో దాదాపు 21 ప్లాట్లు ఉన్నాయి. నివాసితులు గాఢ నిద్రలో ఉండగా ప్రమాదం జరిగింది. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. భవనం కూలిన దుర్ఘటనలో మృతులకు ప్రధాని మోదీ సంతాపం తెలిపారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. భవనం కూలిపోవడంపై విచారం వ్యక్తం చేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రధాని ఆకాంక్షించారు. ఘటనా స్థలంలో సహాయ కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. బాధితులను అన్నివిధాల ఆదుకుంటామని చెప్పారు. వారికి కావాల్సిన సహాయం అందిస్తామని వెల్లడించారు.

వ్యవసాయ బిల్లులు 21వ శతాబ్దపు భారతదేశ అవసరం

వ్యవసాయరంగంలో మార్పు ఇప్పటి తక్షణ అవసరం. తమ ఉత్పత్తులను ఎక్కడైనా..ఏ ధరకైనా అమ్ముకోవచ్చు

రైతుల ఆర్థికస్థితిగతులను మార్చనున్న బిల్లులు

ఓటు బ్యాంక్ కోసమే విపక్షాల రాద్ధాంతం

–ప్రధాని మోదీ స్పష్టీకరణ

న్యూఢిల్లీ,సెప్టెంబర్21(ఆర్ఎన్ఎ): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యవసాయ బిల్లులు 21వ శతాబ్దపు భారతదేశ అవసరమని ప్రధాని నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. ఈ బిల్లులు చారిత్రాత్మకమని... రైతుల ఆర్థిక స్థితి గతులను మార్చివేస్తాయని చెప్పారు. తాజా బిల్లులతో రైతులు తమ ఉత్పత్తులను ఎక్కడైనా... ఏ ధరకైనా అమ్ముకునే వెసులుబాటు కలిగిందన్నారు. ఉభయసభల్లో వ్యవసాయ బిల్లులు ఆమోదం పొందిన నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ ఆన్‌లైన్ ద్వారా వీటిపై మాట్లాడారు. పార్లమెంటులో రెండు వ్యవసాయ బిల్లులు ఆమోదం పొందాయి. ఈ సందర్భంగా రైతులకు అభినందనలు తెలియజేస్తున్నాను. వ్యవసాయరంగంలో ఈ మార్పు ఇప్పటి తక్షణ అవసరం... అందుకే తమ ప్రభుత్వం కొత్త సంస్కరణలు తీసుకొచ్చింది. ఇప్పుడు రైతులు తమ ఉత్పత్తులను తమకు నచ్చిన ధరకు ఎక్కడైనా అమ్ముకోవచ్చు. రైతుల ఆర్థిక స్థితి గతులను మార్చేందుకు ఈ బిల్లులు ఉపయోగపడుతాయని మోదీ పేర్కొన్నారు.కొత్త బిల్లులు చట్టాలుగా అమలులోకి వస్తే ఇప్పుడున్న మండీలు లేదా వ్యవసాయ మార్కెట్లు లేకుండా పోతాయని కొంతమంది అసత్య ప్రచారం చేస్తున్నారని మోదీ అన్నారు. ఆ మండీలు అలాగే కొనసాగుతాయని చెప్పారు. కేంద్రం తీసుకొచ్చిన బిల్లులతో విపక్షాల రైతుల ఓటుబ్యాంకు చేజారిపోయే ప్రమాదముందని, అందుకే ప్రతిపక్షాలు లేనిపోని విమర్శలు చేస్తున్నాయని ఘాటుగా విమర్శించారు. ప్రతిపక్షాలు వివాదాస్పద వ్యాఖ్యలకు నిర్మాతలంటూ తీవ్రంగా ధ్వజమెత్తారు. కొత్త చట్టాలతో చాలా మందికి కొత్త ఇబ్బందులు వచ్చాయి. కొత్త బిల్లుతో మండీలకే ఏం జరుగుతుంది? అవేమైనా మూతపడతాయా? అలాంటిది ఎప్పటికీ జరగదని మోదీ స్పష్టం చేశారు. కొత్త చట్టంతో మార్కెట్‌కు వచ్చిన నష్టమేమీ లేదని, అవి కొనసాగుతాయని, గతంలో కంటే మరింత మెరుగ్గా పనిచేస్తాయని ఆయన ప్రకటించారు.

కొత్త చట్టాలతో మార్కెట్‌కు నష్ట వాటిల్లుతుందని కొందరు ప్రచారం చేస్తున్నారని, అది పూర్తిగా తప్పుడు ప్రచారమని మోదీ స్పష్టం చేశారు. కొత్త చట్టాలతో రైతుల ఆర్థిక పరిస్థితి మారిపోతుందని, 21 వ శతాబ్దికి ఈ బిల్లులు అత్యావశ్యకమని నొక్కి వక్కానించారు. పార్లమెంటులో వ్యవసాయ బిల్లులు ఆమోదం పొందాయి. రైతుకు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతున్నా. రైతుల్లో విప్లవం తేవడానికే ఈ బిల్లు. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ బిల్లు అత్యావశ్యకం అని మోదీ పేర్కొన్నారు. భారత దేశ గ్రామాలు స్వావలంబన దిశగా అడుగులు వేస్తున్నాయని, ఆ అడుగులు బిహార్ నుంచి మొదలు కావడం ఎంతో ముదావహం అని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. బిహార్‌కు చెందిన 294 కోట్ల విలువైన హైవే ప్రాజెక్టులను ప్రధాని మోదీ సోమవారం ప్రారంభించారు. దీంతో పాటు 'ఇంటి వరకూ ఫైబర్' అన్న కార్యక్రమాన్ని కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ... మౌలిక సదుపాయాలపై గ్రామాలు దృష్టి సారించాయని, అలా దృష్టి పెడుతూనే వేగంగా అభివృద్ధి సాగిస్తున్నాయని అన్నారు. అటల్

ప్రమాదంలో తిరుమల ఆచారాలు !

నేటినిజం
మంగళవారం 22-9-2020

తిరుమల ప్రమాదంలో పడింది. ఆచారాలు మంటగలిసేలా ఉన్నాయి. ఇతర మతస్థుల విషయంలో లేని రాద్ధాంతం ఇప్పుడు తిరుమలకే చుట్టుకోవడం వెనక పెద్ద కుట్ర దాగి ఉందనడంలో సందేహం లేదు. సంప్రదాయాలను గౌరవించలేని వారి పెత్తనంలో ఉన్న కారణంగా ఇప్పుడన్నీ అనుమానాలు..అవహేళనను చోటుచేసుకుంటున్నాయి. పవిత్ర మక్కాలో ముస్లిమేతరులకు ప్రవేశం లేదు. అది వారి ఆచారం. మనమంతా గౌరవించాలి. కానీ తిరుమలలో ఆచారాలు పాటించరా? ఛైర్మన్ పదవిలో ఉన్న వైవి సుబ్బారెడ్డి, మంత్రి కొడాలి నానిలు పనిగట్టుకుని వరుసగా చేస్తున్న వ్యాఖ్యలు తిరుమల పవిత్రతను దెబ్బతీసేవిగానే కాకుండా ఆధ్యాత్మిక తిరుమల వ్యవహారాలను సవాల్ చేస్తున్నాయి. హిందూ సంప్రదాయాలను సవాల్ చేస్తున్నాయి. హిందువుల భావాలను దెబ్బతీస్తున్నాయి. హిందూమత సంస్థల పవిత్రతను దెబ్బతీసేందుకు పునాది వేస్తున్నారు. ఇప్పుడు కేవలం డిక్లరేషన్ అంటారు. రేపు తీర్థప్రాసాదాలు ఎందుకంటారు. ఇది సహేతుకమా కాదా అన్నది ఆలోచన చేయాలి. నిలదీయాలి. నిగ్గదీయాలి. తిరుమల ఆచార వ్యవహారాల గురించి మాట్లాడే అర్హత వారికి ఎవరు ఇచ్చారన్నది నిలదీయాలి. హిందూ వీరతాళ్లు వేసుకున్నామని విర్రవీగుతున్న బిజెపి గణం ఏం చేస్తుందో నిలదీయాలి. తిరుమలలో సాక్షాత్తూ నారాయ ణుడే వేంకటేశ్వరుడి రూపంలో అవతరించాడని ,అదో పరమపవిత్ర క్షేత్రమని కోట్లాదిమంది హిందువుల నమ్మకం. ఆ నమ్మకాలను ఇప్పుడు రాజకీయ నేతలు సవాల్ చేస్తున్నారు. నిజానికి అలాంటి పరమ పవిత్రమైన వెంకన్న సన్నిధిలోకి అన్యమతస్థులకు ప్రవేశం లేదు. అక్కడ రాజకీయ పార్టీల ప్రమేయం ఉండరాదు. వారి పెత్తనంతో తిరుమల ఆచార వ్యవహారాలు నడవరాదు. అయినా హిందువులు ఉదారవాదులు కనుక ఎవరైనా తిరుమల సందర్శిం చుకునే భాగ్యం కలిగించారు. కలియయుగ వైకుంఠంగా భాసిల్తుతున్న తిరుమలలో అన్యమతస్థులకు ప్రవేశం లేదన్న బోర్డు అక్కడ కానరాదు. క్యూలో వెళ్తున్న వారిని ఆపి నీది ఏమతం ఏది అని ఎవ్వరూ అడగరు! ఏడుకొండల వాడి సన్నిధికి అందరికీ దర్శనభాగ్యం కలిగిస్తున్నారు. ఇది ఓ ఆచారంగా వస్తోంది. నిలదీసి అడిగితే నిజంగా ఇప్పుడు కోట్లాది మంది హిందువులు తిరుమలలో రోజూ డిక్లరేషన్ ఫారాలు తీసుకుని వెళ్లాల్సి ఉంటుంది. అయితే వీఐపీ హోదాలో ప్రొటోకాల్ దర్శనం చేసుకునే అన్యమతస్థులకు మాత్రమే వర్తించే ఒక నిబంధన డిక్లరేషన్. 'వెంకన్న స్వామిపై మాకు విశ్వాసం ఉంది' అని డిక్లరేషన్ ఇవ్వడం అన్నది నిబంధన. దీనిని పాటించాల్సిందే. తిరుమలకు వచ్చి డిక్లరేషన్ ఇవ్వడమంటే ఇక్కడి సంప్రదాయా లను గౌరవిస్తామని చెప్పడం కోసమే. వివిధ వర్గాలు, మతాలు ఉన్న భారతదేశంలో ఇలాంటి నిబంధన అన్నది తిరుమలతో పాటు పలు ఆలయాల్లో అమల్లో ఉంది. అయితే ఇప్పుడదే వివాదస్పందంగా చేయడం ద్వారా తిరుమలపై పెత్తనం సాగించాలన్న ఓ వర్గం కుట్రలు సాగుతున్నాయి. డిక్లరేషన్‌ను కూడా వివాదాస్పదంగా మార్చారు. అన్యమతస్థులకు డిక్లరేషన్ అవసరం లేదని అంటూ టీటీడీ చైర్మన్ హోదాలో వైవీ సుబ్బారెడ్డి ఆకస్మికంగా ఎందుకు చెప్పారో ..దాని వెనక ఉన్న కుట్రలు ఏంటో హిందూవీర తాళ్లు వేసుకున్న వారు ఆలోచన చేయాలి. అలాగే హిందూ సమాజం కూడా ఆలచన చేయాలి. తిరుమల శ్రీవారి భక్తులుకూడా ఆలోచన చేయాలి. దానికి కొనసాగింపుగా మంత్రి కొడాలి నాని చేసిన వ్యాఖ్యలు ఇంకా దుర్మార్గంగా ఉన్నాయి. ఈ వ్యాఖ్యలు ఎవ్వరికీ అర్థం కావడం లేదనుకోవ డానికి లేదు. దీని వెనక ఎలాంటి కుట్రలు లేవనుకోవడానికి కూడా లేదు. వాస్తవానికి వెంకన్నను దర్శించు కునే ఇతర మతాల వారు డిక్లరేషన్ ఇవ్వాల్సిందే. 'వేంకటేశ్వర స్వామిపై మాకు విశ్వాసం ఉంది' అని ముద్రించిన పత్రంపై సంతకం చేయాలి. క్యూలో వెళ్లే భక్తులెవరినీ దీని గురించి అడగరు. అయితే, వీవీఐపీలకు వారి హోదాను అనుసరించి

ఆలయ సంప్రదాయం ప్రకారం మర్యాదలు చేయాల్సి ఉంటుంది. అందువల్ల, వారి నుంచి మాత్రమే డిక్లరేషన్ తీసుకుంటారు. 1960 నుంచి ఈ సంప్రదాయాన్ని విధిగా పాటిస్తున్నారు. దీనిపై 1990లో ప్రభుత్వం అధికారికంగా జీవో కూడా జారీ చేసింది. 'డిక్లరేషన్' నిబంధనను ప్రధాని, రాష్ట్రపతి హోదాలో పని చేసిన వారు సైతం గౌరవించారు. దానిని అవమానంగానో, తమ మతాన్ని కించపరిచినట్లుగానో భావించలేదు. ఇందిరాగాంధీ నుంచి టీటీడీ అధికారులు డిక్లరేషన్ తీసుకున్నారు.ఇందిర జన్మతః హిందువు. పార్శీ మతానికి చెందిన వ్యక్తిని పెళ్లాడినందున 'డిక్లరేషన్' ఇవ్వాలని కోరారు. తొలుత తటపటాయించి నప్పటికీ, ఆ తర్వాత డిక్లరేషన్‌పై ఆమె సంతకం పెట్టారు. ఇక... కేంద్ర మంత్రి హోదాలో వచ్చిన జాఫర్ షరీఫ్ ఆయనకు డిక్లరేషన్ గురించి చెప్పారు. 'అందులో ఏముంటుంది?' అని అడిగారు. 'వేంకటేశ్వర స్వామిపై నాకు విశ్వాసం ఉంది' అని ఉంటుందని అధికారులు తెలిపారు. స్వామిపై భక్తి లేనప్పుడు ఎక్కడి నుంచో ఎందుకు వస్తాను. పత్రం తీసుకురండి సంతకం పెడతాను' అంటూ జాఫర్ షరీఫ్ సూటిగానే చెప్పారు. ఇక...కశ్మీర్‌కు చెందిన ఫరూక్ అబ్దుల్లా కూడా ఏమాత్రం సంశయం లేకుండా డిక్లరేషన్ ఇచ్చారు. రాష్ట్రపతిగా వ్యవహరించిన ఏపీజే అబ్దుల్ కలామ్ నుంచి కూడా అధికారులు డిక్లరేషన్ తీసుకున్నారు. 1998లో సోనియా గాంధీ ఏఐసీసీ అధ్యక్షురాలిగా ఎన్నికైన తర్వాత వెంకన్న దర్శనానికి వచ్చారు. అప్పట్లో... టీటీడీ ఈవోగా ఐవీ సుబ్బారావు ఉన్నారు. సోనియాను అన్యమతస్థురాలిగా గుర్తించి... డిక్లరేషన్‌పై సంతకం కోరారు. ఆమె అందుకు నిరాకరించారు. చివరికి... 'నేను భారతీయ మహిళను. భారతీయ సంప్రదాయాలు, కుటుంబ ఆచారాలు పాటిస్తున్నాను' అని సోనియా డిక్లరేషన్ ఇచ్చాకే దర్శనం చేసుకున్నారు. ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ నిస్సార్ అహ్మద్ కక్రూ తిరుమల వచ్చినప్పుడు అధికారులు ఆయన వద్దకు డిక్లరేషన్ ఫామ్ తీసుకెళ్లారు. ఆయన డిక్లరేషన్ ఇచ్చేందుకు ఇష్టపడలేదు. కానీ, 'మీ సంప్రదాయాన్ని నేను గౌరవిస్తాను' అని చెప్పి, దర్శనం చేసుకోకుండానే వెళ్లిపోయారు. జస్టిస్ కక్రూ మినహా... డిక్లరేషన్ ఇచ్చేందుకు నిరాకరించిన ప్రముఖులు లేరు. ఇందిరను పూరీ జగన్నాథ్ ఆలయంలోకే అనుమతించలేదు. రాజీవ్‌కీ అదే పరిస్థితి ఎదురైంది. కానీ... తిరుమల ఎవరైనా రావచ్చు! డిక్లరేషన్ సంప్రదాయం వద్దనడానికి వైవి సుబ్బారెడ్డి, కొడాలి నానిలకు ఎవరు అధికారం ఇచ్చారు. దీనిపై ఇప్పటికే జారీ అయిన జీవోను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని వైవీ సుబ్బారెడ్డి దీని గురించి మాట్లాడటంలో అర్థమేమిటో? మనమంతా అర్థం చేసుకోవాలి. అన్య మతస్థులు డిక్లరేషన్ ఇవ్వాల్సిన అవసరం లేదని వైవీ ప్రకటించడం తిరుమల ఆలయ నిబంధనలకు తూట్లు పొడిచేలా ఉందనడంలో ఎలాంటి సందేహాలు అవసరం లేదు. అయితే వరుస ఘటనలు చూస్తుంటే అనుమానాలు రెట్టింపు అవుతున్నాయి. అంతర్వేది రథం తగుల బెట్టారు. విజయవాడ రథం వెండి సింహాలు మాయం అయ్యాయి. ఇలా వరుస ఘటనలు చూస్తుంటే ఏదో ఉద్రవం ముంచుకుని వచ్చేలా ఉందన్న ఆందోళన ప్రజల్లో వ్యక్తం అవుతున్న వేళ తిరుమల పవిత్రతపై చర్చ చేయాలి. ఇలాంటి వ్యాఖ్యలు చేసిన వారు బేషరుతగా క్షమాపణలు చెప్పి స్వామివారికి క్షమాపణలు కోరాలి. తిరుమల నిధులు కైంకర్యం చేసే కుట్రలకు కూడా తెరలేపారు. ఇవన్నీ చూస్తూ ఊరుకుంటారా లేక నిలదీస్తారా అన్నది శ్రీవారి భక్తులు తేల్చుకోవాలి.

వచ్చే నెలలో పత్తి కొనుగోళ్లు

-ముందస్తు ఏర్పాట్లలో అధికారులు

ఆదిలాబాద్,సెప్టెంబర్21(ఆర్ఎన్ఎ): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా ఈ యేడాది పత్తి సాగు విస్తీర్ణం పెరిగింది. ప్రభుత్వం ఈ యేడాది పత్తి క్వింటాలుకు కనీస మద్దతు ధర మధ్య రకానికి రూ.5,515, పొడవాటి రకానికి రూ.5,825 ప్రకటించింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సీసీఐ ఆధ్వర్యంలో పత్తిని సేకరించనున్నారు.

ప్రస్తుతం పంట కాయదశలో ఉండగా.. అక్టోబర్ రెండో వారంలో కొనుగోళ్లు ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇందులో భాగంగా అధికారులు జిన్నింగ్‌లలో పంట కొనుగోళ్లలో భాగంగా అవసరమైన సిబ్బందిని నియమిస్తారు. ప్రభుత్వం ప్రకటించిన మద్ద తు ధర కంటే బహిరంగ మార్కెట్‌లో ఎక్కువ ధర ఉంటే రైతులు ప్రైవేట్ వ్యాపారులకు పత్తిని అమ్ముకునే అవకాశం ఉంది. వ్యాపారులు పంటలో తేమ శాతం ఎక్కువగా ఉందనే సాకుతో మద్ద తు ధర చెల్లించని పక్షంలో సీసీఐ అధికారులు రైతులు వద్ద నుంచి పంటను కొనుగోలు చేస్తారు. కరోనా నేపథ్యంలో పంట కొనుగోళ్ల లో అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

సీజన్‌లో రైతులు సాగు చేస్తున్న పత్తి పంట కొనుగోలుకు ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు ఆదిలాబాద్ జిల్లా మార్కెటింగ్ అధికారి అశ్వాక్ తెలిపారు. . సీసీఐ ఆధ్వర్యంలో పంటను సేకరించనున్నాం. అక్టోబర్ రెండో వారంలో కొనుగోళ్లు ప్రారంభమయ్యే అవకాశాలున్నాయని అన్నారు. ఆయా మార్కెట్ యార్డుల పరిధిలోని రైతులకు ఏ రోజు పత్తి తీసుకురావాలనే వివరాలు ముందుగానే తెలియజేస్తాం. ఎలాంటి ఇబ్బందులు లేకుండా, కొవి డ్-19 నిబంధనలు పాటిస్తూ కొనుగోళ్లు చేపడుతామన్నారు. సీఎం కేసీఆర్ నియంత్రిత పద్ధతిలో సాగు చేయాలని పిలుపు నివ్వడంతో రైతులు పత్తి వైపు మొగ్గు చూపారు. దీనికితోడు వాతావరణం అనుకూలించడం, సకాలంలో వర్షాలు కురవడం, సర్కారు కొరత లేకుండా విత్తనాలు, ఎరువులు అందించడం, వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తూ సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రస్తుతం పత్తి ఏపుగా పెరిగి కాయదశలో ఉంది. అన్ని అనుకూలించడంతో పంట దిగుబడి ఎకరానికి ఎనిమిది నుంచి పది క్వింటాళ్ల వరకు వచ్చే అవకాశాలున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా ఈ యేడాది 10.15 లక్షల ఎకరాల్లో పత్తి సాగవగా 88 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు 52 కొనుగోలు కేంద్రాల్లో పత్తి పంటను సేకరించనున్నారు. మార్కెట్ యార్డులతోపాటు జిన్నింగ్‌మిల్లుల్లో పంటను సేకరిస్తారు. ఆదిలాబాద్ జిల్లాలో పది కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా.. ఆదిలాబాద్ మార్కెట్ యార్డుతోపాటు పాత మార్కెట్‌యార్డులో పత్తిని సేకరించనున్నారు. బోథ్, పొచ్చెర, సొనాల, ఇచ్చోడ, నేరడిగొండ, ఇంద్రవెల్లి, నార్నూర్, జైల జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. నిర్మల్ జిల్లాలో కూడా నిర్మల్, సారంగాపూర్, భైంసా మండలాల్లో కొనుగోలు చేయనున్నారు. సీసీఐ ఆధ్వర్యంలో కొనుగోళ్లు జరుగనున్నాయి.

త్వరగా రైతువేదికల నిర్మాణాల పూర్తి

ఆదిలాబాద్,సెప్టెంబర్21(ఆర్ఎన్ఎ): రైతువేదికల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ సంధ్యారాణి అన్నారు. రైతు వేదికల నిర్మాణాలను దసరా పండుగలోగా పూర్తి చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకోసం ప్రత్యేకంగా రైతు వేదికలు నిర్మిస్తున్నదని చెప్పారు. సాగులో ఆధునిక పద్ధతులపై అవగాహన కల్పించేందుకు రైతు వేదికలు ఏర్పాటు చేస్తున్నదని చెప్పారు. నిర్మాణంలో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. నిర్మాణంలో ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని సూచించారు. సంబంధిత శాఖ అధికారులు దగ్గరుండి పనులు పర్యవేక్షించాలన్నారు.

పల్లె ప్రకృతి వనాలకు స్థల పరిశీలన చేయాలి

జనగామ,సెప్టెంబర్21(ఆర్ఎన్ఎ): గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాల ఏర్పాటుకు స్థల పరిశీలన చేయాలని, గ్రామ పంచాయతీలు వీటిపై పర్యవేక్షించడంతోపాటు పనులు పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ నిఖిల కోరారు.

పల్లెప్రగతిలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో చేపట్టిన వైకుంఠధామాల నిర్మాణం, తడి పొడి చెత్త షెడ్లు, రైతు వేదికలు, రైతు కల్లాల నిర్మాణం, హరితహారం, గ్రామాల్లో పారిశుధ్యం, ఎల్ఆర్ఎస్ అమలుపై ఆయా శాఖల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అలాగే మండలాల వారీగా ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎంపీవోలతో నిఖిల చర్చించారు. పెండింగ్‌లో ఉన్న పనులకు గల కారణాలపై ఆమె ఆరా తీశారు. అభివృద్ధిపనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అభివృద్ధి పనులు పూర్తి చేసిన అధికారులను నిఖిల అభినందించారు. గ్రామాల్లో శానిటేషన్ పనులను ప్రతి నెల 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు, అనంతరం 15 నుంచి 20వ తేదీ వరకు చేయాలని సూచించారు. అలాగే జిల్లా కేంద్రంలోని ఏరియా హాస్పిటల్‌లో ప్రతి నెల 1 నుంచి 15వ తేదీలోపు సదరం క్యాంపులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ నిఖిల సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏరియా హాస్పిటల్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సంబంధిత వైద్యాధికారులు సదరం క్యాంపు నిర్వహించాలని ఆదేశించారు. వీటికి జిల్లాలోని దివ్యాంగులు తొలుత మీసేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. స్లాట్‌లో నిర్ణయించిన తేదీల ప్రకారం సదరం క్యాంపునకు హాజరుకావాలని పేర్కొన్నారు. దీంతోపాటు ఆ రోజు వైద్యాధికారులు విధుల్లో ఉండేలా చూడాలని సదరం కమిటీ సభ్యులకు నిఖిల సూచించారు. క్యాంపును నిర్వహించే సమయంలో ప్రతి ఒక్కరూ మాస్కు ధరించడంతో పాటు భౌతిక దూరం పాటిస్తూ కరోనా నిబంధనలు పాటించాలని కలెక్టర్ సూచించారు. ఈ మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి మహేందర్కి సూచనలు చేశారు.

ఆక్రమణలతో నగరంలో నరకయాతన

వర్షం వస్తే సంద్రంగా మారుతున్న మహానరగరం

హైదరాబాద్,సెప్టెంబర్21(ఆర్ఎన్ఎ): భారీ వర్ష్ కురిస్తే రాజధాని హైదరాబాద్.. మహాసంద్రంగా మారుతోంది. మొన్నీవ ఇద్యనే వరంగల్ నగరం నిండా మునిగింది. దీనికి ఆక్రమణలే కాణమని గుర్తించారు. తాజాగా వరదల్లో పడి రెండు ప్రాణాలు గల్లంతయ్యాయి. సుమేధ అనే బాలిక, సరూర్‌నగర్‌లో ఓ వ్యక్తి నీట కొట్టుకుని పోయారు. ఇద ఇనిజంగా విషాదమే. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం, వేలకోట్లు కర్చ చేసినా నాలాలను పునరుద్ధరిం చకపోవడం వంటి కారణాల వల్ల వానొస్తే నగరవాసులు వణుకుతున్నారు. వానొస్తే ఈ మహాసముద్రంలో ఏ నాలా ఎక్కడుందో తెలియదు. మూతల్లేని మ్యాన్‌హోల్స్ ఏ క్షణాన మింగేస్తాయో అంతకన్నా తెలియదు. రోడ్డు మీదకు వచ్చిన ప్రజలు క్షేమంగా ఇంటికి చేరితే చాలనుకుంటు న్నారు. కార్లు సైతం మునిగిపోయేంతగా రో÷-డలపై నీరు ప్రవహిస్తోంది. గత నాలుగైదు రోజులలగా కురుస్తున్న భారీ వర్షాలకు అధ్వానంగా మారిన రోడ్లే ఇందుకు సాక్ష్యం. నాలాలు పొంగుతున్నా , ఏటా కోట్లు కర్చు చేస్తున్న నగర దౌర్భాగ్యం మాత్రం మారడం లేదు. ఇటీవలి అసెంబ్లీ సమావేశాల్లో వేలకోట్లు కర్చు చేశామని మంత్రి కెటిఆర్ ప్రకటించారు. అవన్నీ ఎక్కడ పోయాయో అన్న ప్రశ్న తలెత్తుతోంది. రోడ్ల నిర్వహణ విషయంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు చెప్పే మాటలకు, వాస్తవ పరిస్థితులకు ఎంతో తేడా ఉంటోంది. విశ్వనగరంగా మారుస్తామని చెప్పే ప్రభుత్వం నగర రోడ్ల విషయంలో అంతర్జాతీయ ప్రమాణాలను ఏమాత్రం పాటించడం లేదు. రోడ్ల కోసం నిధులను కేటాయించడం, వాటిని ఖర్చు చేయడంపై పెట్టే ఫోకస్, రోడ్ల నాణ్యతపై ఏమాత్రం పెట్టడం లేదని నగర వాసులు విమర్శిస్తున్నారు. రోడ్ల నిర్మాణం, రీ కార్పెటింగ్ పేరిట సగటున ఏటా రూ.300 కోట్లకుపైగా జీహెచ్ఎంసీ ఖర్చుచేస్తోంది. గత ఐదేళ్లలో రూ.1500 కోట్లకు పైగానే ఇలా రోడ్ల మరమ్మతు కోసం జీహెచ్ఎంసీ ఖర్చు చేయడం గమనార్హం. అయినా పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో.. ఈ క్షణంలో బయటికెళ్లి ఏ రోడ్డును చూసినా అర్థమవు తుంది! హైదరాబాద్ మహా నగరానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డులు, రివార్డులు వస్తున్నాయి. పర్యాటక రంగంలో ప్రపంచంలోనే మంచి నగరంగా గుర్తింపు వచ్చింది. అలాంటి గొప్ప నగరం లో రోడ్లు.. ఒక్క వానకే కొట్టుకుపోతున్నాయి. వేసవిలో వేసేరోడ్లు.. నాలుగు నెలలు గడవకముందే గుంతలమయంగా మారుతు న్నాయి. వాన కురిసినప్పుడు ఆ గుంతలు ఎక్కడ ఉన్నాయో తెలియక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నాలుగు దశాబ్దాల ఏళ్ల చరిత్ర ఉన్న హైదరాబాద్ మహానగరానికి ప్రణాళికా బద్ధమైన పట్టణీకరణ లేకపోవడం కూడా శాపంగా మారింది. మెట్రో ప్రాజెక్టుతోనూ రహదారు లు దెబ్బతిన్నాయి. మెట్రో కారిడార్‌లలో వయాడక్టులపై కురిసిన వర్షపు నీటినంతా ప్రధాన రహదారులపైకి వదిలేస్తున్నారు. రోడ్లపై నీటి నిల్వతో ట్రాఫి క్‌కూ ఇబ్బందికరంగా మారుతోంది. ప్రణాళికాబద్ధంగా వర్షపు నీరు నేరుగా నాలాల్లోకి వెళ్లేలా ఏర్పాటు చేయకుండా రోడ్ల మీదకు వదలడంతో ఒక్కసారిగా వర్షపు నీరు వచ్చి రోడ్లన్నీ నిండిపోవడంతో పాటు గుంతలమయంగా మారుతున్నాయి. అలా కాకుండా ఆ నీటిని.. డ్రైనేజీకి అనుసంధానం చేస్తే నీరు వెళ్లిపోతుంది. అలా చేయకపోవడం వల్ల వర్షం కురిస్తే చాలు.. చాలా రోడ్లపై నీళ్లు నిలిచిపోత న్నాయి. చెరువులు, నాలాలు, కుంటలను ఆక్రమించి ఇళ్ల నిర్మాణం చేపడుతుంటే అడ్డుకోవాల్సిన ప్రభుత్వ యంత్రాంగం చూసీ చూడనట్లు వ్యవహరించడమే ఈ సమస్యలన్నింటికీ కారణం.

కొన్ని కాలనీలు, బస్తీల్లో అయితే భారీ వర్షం వస్తే ఇళ్లల్లోకే మోకాళ్లలోతు నీళ్లు వచ్చేస్తున్న దుస్థితి నెలకొనడానికి కారణంగా మారింది. కొన్ని కాలనీల నుంచి నీరు బయటకు వెళ్లే మార్గం లేదు. దాంతో, రోడ్లకు గండి పెట్టి.. ఆ నీటిని మళ్లించాల్సిన పరిస్థితి నెలకొంటోంది. ఇవన్నీసరిచేయకుంటే ఎన్ని కోట్లు ఖర్చు చేసినా మహానగర పరస్థితి మారదు.

వ్యవసాయ బిల్లులపై రైతుల్లో ఆందోళన

రాష్ట్రాల హక్కుల్లో తలదూర్చేవంటున్న విపక్షాలు
రైతులకు రక్షణ లేకుండా పోతుందన్న భయాలు

న్యూఢిల్లీ,సెప్టెంబర్21(ఆర్ఎన్ఎ): వ్యవసాయ బిల్లులను గట్టెక్కించుకున్న బిజెపి ప్రభుత్వం సమగ్ర చర్చ ద్వారా ప్రజలకు సందేశం ఇవ్వలేకపోయింది. బిల్లు వల్ల కలిగే లాభనష్టాలపై చర్చకు అవకాశం లేకుండా చేశారు. ఎన్‌డిఎ ప్రభుత్వ పాలనలో, ప్రభుత్వ విధానాన్ని వ్యతిరేకిస్తూ ఒక కేబినెట్ మంత్రి రాజీనామా చేయడం సమస్య తీవ్రతను అర్థం చేసుకోవాలి. భారతీయ జనతాపార్టీకి మిత్రపక్షంగా ఉంటున్న శిరోమణి అకాలీదళ్ తన కార్యకర్తల నుంచి, మద్దతుదారులైన రైతాంగ శ్రేణుల నుంచి వచ్చిన ఒత్తిడికి తలవొగ్గి, వివాదాస్పదమైన వ్యవసాయరంగ బిల్లులకు వ్యతిరేకతను బాహాటంగా ప్రకటిస్తూ, తమ మంత్రి హర్ సిమ్రత్ కౌర్ బాదల్‌ని ప్రభుత్వం నుంచి ఉపసంహరించుకున్నది. శిరోమణి అకాలీదళ్ అధ్యక్షులు, పార్లమెంటు సభ్యులు సుఖ్ బీర్ సింగ్ బాదల్ ఈ నిర్ణయాన్ని లోక్‌సభలో ప్రకటించారు. ఈ మూడు బిల్లులలోని నిర్ణయాలను కేంద్రప్రభుత్వం మునుపే ఆర్డినెన్స్‌లుగా జారీచేసింది. వాటిపై తీవ్ర విమర్శలు వెలువడ్డాయి. ప్రస్తుత వర్షాకాల సమావేశాలలో ఈ ఆర్డినన్సులను సభామోదం కోసం బిల్లులుగా ప్రవేశపెట్టారు. ఒక పక్క, బిల్లులపై తర్జనభర్జనలు, నిరసనలు వెలువడుతుండగానే, నిత్యావసర సరుకుల (సవరణ) బిల్లు 2020ను లోక్‌సభ ఆమోదించింది. తక్కిన రెండు బిల్లులపై చర్చ సందర్భంగానే అకాలీదళ్ తమ మంత్రి నిష్క్రమణను ప్రకటించింది. హర్ సిమ్రత్ కౌర్ వ్యవసాయరంగంతో అనుబంధం ఉన్న ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల కేబినెట్ మంత్రిగా ఉన్నారు. ఈ మూడు ఆర్డినెన్స్‌లు దేశవ్యాప్తంగా రైతాంగంలో, ముఖ్యంగా పంజాబ్, హర్యానా, మహారాష్ట్ర వంటి వాణిజ్యపంటల రైతాంగంలో తీవ్ర అలజడిని కలిగించాయి. ఇది పెద్దపెద్ద రైతులు తమ ఉత్పత్తిని భారీగా నిల్వచేసుకోవడానికి చట్టబద్ధత కల్పిస్తోందని, రాష్ట్రాల జాబితాలోని వ్యవసాయ, మార్కెట్ రంగాలలో కేంద్రం పెత్తనం చేస్తూ.. తమ హక్కులను హరిస్తుందని రాష్ట్రాలు వాదిస్తున్నాయి. మొత్తం మీద ఈ మూడు బిల్లులూ, వ్యవసాయరంగాన్ని మార్కెట్‌కు అనుసంధానం చేయడానికి ఉద్దేశించినవే. దానితోపాటు, ఫెడరల్ స్ఫూర్తిని దెబ్బతీస్తూ, కేంద్రం అధికారాలను ఏకపక్షంగా విస్తరించే బిల్లులుగా ఆయా రాష్ట్రాలు ఆందోళన చెందుతున్నాయి. కరోనా ఉత్పాత సమయంలో, ప్రజలు భయాందోళనల్లో ఉన్న సమయంలో, అనేక వివాదాస్పదమైన నిర్ణయాలను త్వరితగతిన చట్టబద్ధం చేయాలన్న పథకంలో భాగంగానే ఈ మూడు బిల్లులను హడావుడిగా తీసుకువచ్చా రని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. కేందప్రభుత్వ మిత్రపక్షం నుంచే గట్టి ప్రతిఘటన ఎదురయింది. ఆత్మనిర్భరత గురించి చెబుతూ రైతులను పరాధీనులుగా మార్చే ప్రయత్నం మంచిది కాదన్నాయి. ఆహారభద్రతకు ఈ బిల్లు పెద్ద ప్రమాదమని విమర్శకులు అంటున్నారు.

వ్యవసాయ ఉత్పత్తిని కొనేవారికి, రైతుకు మధ్య జరిగే వర్తక ఒప్పందాల చట్రాన్ని ఈ బిల్లు సూచిస్తున్నదని, ఇది రైతుకు న్యాయమైన ధర ఇప్పించేందుకు ఉపయోగపడేదని ప్రభుత్వం చెబుతోంది. పంజాబ్, హర్యానా రైతులు ప్రభుత్వ వాదనను నమ్మడం లేదు. రైతును కాంట్రాక్టు వ్యవసాయంలోకి దించేవరకే, అధిక ప్రతిఫలాన్ని ఇవ్వజూపుతారని, ఒకసారి వ్యవసాయరంగమంతా కాంట్రాక్టుమయం కాగానే, వ్యాపారులే శాసిస్తారని రైతాంగం భయపడుతున్నది. వ్యవసాయోత్పత్తులను స్థానిక, నిర్ణీత వ్యవసాయ మార్కెట్లలోనే కాకుండా, వెల ఎపలికి కూడా తరలించి అమ్ముకోవడానికి వీలు కల్పించే ఈ బిల్లు వ్యవసాయదారులకు వరం వంటిదని కేంద్రం చెప్పుకున్నది. సంప్రదాయ మార్కెట్లు అమ్మకందారుకీ, కొనుగోలుదారుకీ నడుమ ఒక వేదికగా పనిచేసి, రైతులకు అన్యాయం జరగకుండా నిరోధిస్తాయి. కనీసం అటువంటి వ్యవస్థ ఒకటి అక్కడ ఉంటుంది. ఆ మార్కెట్లలో వ్యవహరించే ఏజెంట్లకు, కొనుగోలుదారులకు, అమ్మకందారులకు కూడా లైసెన్సింగ్ ఉంటుంది. తాజా పరిస్థితుల్లో అటువంటి రక్షణలు, పద్ధతులు ఏమీ ఉండవు. కనీస మద్దతు ధరను అమలుచేయాలనే నిబంధన ఏమీ ఉండదు. మార్కెట్ డిమాండ్ ప్రకారమే ధరలు ఉంటాయి. రైతుల అనుభవం ప్రకారం మార్కెట్ శక్తులు నిర్ణయించే ధరలెపుడూ రైతులకు ప్రతికూలంగానే ఉంటాయి.

ఆదిలాబాద్ పట్టణంలో సోమవారం వేకువ జామునే టూ వీలర్‌పై పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించిన ఎమ్మెల్యే జోగురామన్న

పారిశుద్ధ్య పనులను పరిశీలించిన జోగు

ఆదిలాబాద్,సెప్టెంబర్21(ఆర్ఎన్ఎ): ఆదిలాబాద్ పట్టణంలోని పలు వార్డుల్లో బైక్ పై తిరుగుతూ పారిశుద్ధ్య పనులను ఎమ్మెల్యే జోగు రామన్నసోమవారం పరిశీలించారు. పట్టణంలోని పలు వార్డుల్లో మురికి కాలువల పనులతోపాటు రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయి. మున్సిపల్ వైస్ చైర్మన్ దానితో పాటు అధికారులు సిబ్బందితో కలిసి ఆయన పర్యటించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. వర్షం నీరు రోడ్డు పైకి రాకుండా మురుగు కాలువల్లో చెత్తా చెదారం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

ఓపెన్ డ్రింకింగ్‌పై ఉక్కుపాదం

ఒకపక్క బ్లూకోల్ట్స్, పెట్రోకార్ విభాగాలు
మరోపక్క డ్రోన్ కెమెరాలతో నిఘా

కరీంనగర్, సెప్టెంబర్ 21 (నేటినిజం ప్రతినిధి):బహిరంగప్రదేశాల్లో మద్యంసేవించే వారిపై కరీంనగర్ కమిషనరేట్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఒకవైపు బ్లూకోల్ట్స్,పెట్రోకార్ విభాగాలు, మరోపక్క డ్రోన్‌కెమెరాలతో బహ

సింహవాహనంపై యోగనారసింహుడు

బ్రహ్మోత్సవాల్లో శ్రీ మలయప్ప ఊరేగింపు

తిరుమల,సెప్టెంబర్21(ఆర్ఎన్ఎ): తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో మూడో రోజైన సోమవారం ఉదయం 9 గంటలకు శ్రీవారి ఆలయంలోని కల్యాణోత్సవ మండపంలో శ్రీ మలయప్ప స్వామివారు సింహ వాహనంపై యోగనరసింహుడి అలంకారంలో దర్శనమిచ్చారు. ఆలయంలోని ధ్వజస్తంభం వరకు స్వామివారిని సింహ వాహనంపై ఏకాంతంగా ఊరేగించారు. శ్రీవారు మూడో రోజు ఉదయం దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం సింహ వాహనాన్ని అధిరోహించారు. సింహం పరాక్రమానికి, ధైర్యానికి, తేజస్సుకు, ఆధిపత్యానికి, మహోధ్వనికి సంకేతం. ఉదయం నిద్ర లేవగానే దర్శించే వస్తువుల్లో 'సింహదర్శనం' అతి ముఖ్యమయింది. సింహ రూప దర్శనంతో పైన పేర్కొన్న శక్తులన్నీ చైతన్యవంతమవుతాయి. సోమరితనం నశించి పట్టుదలతో ప్రవర్తించి విజయస్ఫూర్తి సిద్ధిస్తుంది. అజ్ఞానంతో ప్రవర్తించే దుష్టులను హరించడంలో నేను, నా వాహనమైన సింహమూ సమాన ప్రయత్నంతో ఉంటామని ఈ సింహ వాహనోత్సవం ద్వారా శ్రీవారు నిరూపించారు. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, బోర్డు సభ్యులు డిపి.అనంత, శివకుమార్, శేఖర్‌రెడ్డి, గోవిందహరి, అదనపు ఈవో ఎవి.ధర్మా రెడ్డి, సివిఎస్వో గోపినాథ్ జెట్టి, ఆలయ డెప్యూటీ ఈవో హరీంద్రనాథ్, పేష్కార్ జగన్‌మోహనాచార్యులు పాల్గొన్నారు.

తిరుమల బ్రహ్మోత్సవాల్లో భాగంగా సింహవాహనంలో నారసింహుడి అవతారంలో ఊరేగిన మలయప్ప స్వామి

గ్రామాల్లో విస్తరిస్తున్న కరోనా

ప్రయాణాలతోనే ప్రమాదంగా మారింది
ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు

హైదరాబాద్,సెప్టెంబర్21 (ఆర్ ఎన్ఎ): కరోనా మహమ్మారి గ్రామాల్లో దూసుకుపోతోంది. రోజురోజుకూ పాజిటివ్ కేసులసంఖ్య పెరుగుతోంది. దీంతో జిల్లాల్లో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామాల్లో ప్రజలు పనుల కోసం బయటకు రావడంతో కేసులు కూడా అదే సంఖ్యలో పెరుగుతున్నాయి. ముందుగానే అంచనా వేసిన విధంగా కేసులు విపరీతంగా పెరిగిపోతున్నాయి. లాక్‌డౌన్ సమయంలో ఉన్న పరిస్థితులు ఇప్పుడు పూర్తిగా మారిపోతున్నాయి. జనం కూడా ఏ మాత్రం భయం లేకుండా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. అధికారులు ఎన్నిసార్లు హెచ్చరించినా ప్రజల్లో మార్పు కనిపించడం లేదు. ఢిల్లీ మర్కజ్‌తో మొదలైన కరోనా వ్యాప్తి హైదరాబాద్‌తో మరింత విజృంభిస్తోంది. రాజధాని వెళ్లివచ్చిన వారందరికీ కరోనా పాజిటివ్‌గానే నిర్ధారణ అవుతోంది. హైదరాబాద్‌లో విజృంభిస్తున్న కరోనాతో జిల్లాలకు మరింత ముప్పు పొంచి ఉందంటున్నారు. నిత్యం రాజధానికి రాకపోకలు కొనసాగడంతోనే వైరస్ వ్యాప్తి జరుగుతున్నట్లు ఇప్పటికే నమోదైన కేసులను బట్టి తెలుస్తోంది. ఉద్యోగం, ఉపాధి, వ్యాపారం, వివిధ రకాల పనుల నిమిత్తం హైదరాబాద్ వెళ్లి వచ్చిన వారితో వైరస్ వ్యాప్తి జరుగు తోంది. జిల్లాల నుంచి నిత్యం వేలాది మంది ప్రయాణికులు హైదరాబాద్‌కు రాకపోకలు సాగిస్తున్నారు. అత్యవసరమైతే తప్ప సాధారణ పనుల నిమిత్తం ప్రయాణాలు చేయరాదంటూ చెబుతున్నా పట్టింపే లేకుండా పోతోంది. సాధ్యమైనంత వరకు జిల్లాలకు వచ్చిపోయే రాకపోకలను నియంత్రించాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరికొన్నాళ్లపాటు ఇవే పరిస్థితులు కొనసాగితే ప్రమాదమేనన్న వాదనలు వినిపిస్తున్నాయి. రోజురోజుకూ పెరిగిపోతున్న కరోనా కేసులతో మరింత ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దీంతో ప్రజలకు ఆర్థిక భారం కూడా పెరుగుతోంది. వ్యాధి నివారణ కోసం లక్షల్లో వెచ్చించాల్సి వస్తోంది. ఇప్పటికే అనుమానిత వ్యక్తులు విచ్చలవిడిగా తిరగడంతో మరెన్నో కేసులు బయటపడే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. బస్తీల నుంచి వచ్చిన కరోనా పాజిటివ్ రోగులను ఇంకా గుర్తించక పోవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇంత ప్రమాదకరంగా మారినా ఎక్కడా భౌతిక దూరాన్ని పాటించడం లేదు. కొందరైతే కనీసం మాస్కులు ధరించకుండానే బయట తిరగడం కనిపిస్తోంది. హరితహారం, అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో జిల్లా అధికారులతో కలిసి నేతలు హడావిడి చేయడంతో పరిస్థితి మరింత తీవ్రమవుతోంది. రాజకీయ కార్యకలాపాల కారణంగా గ్రామాల్లో విస్తరిస్తోందన్న వాదనలు ఉన్నాయి. కొత్త కేసులన్నీ ప్రైమరీ కాంటాక్ట్ కేసులు కావడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇన్నాళ్లు ఢిల్లీ, మహారాష్ట్ర, హైదరాబాద్ వెళ్లి వచ్చిన వారికి వైరస్ సోకగా ప్రస్తుతం వారికి కాంటాక్ట్ అయిన కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అవుతోంది. దీంతో పాటు మరికొంత మందికి కాంటాక్ట్ అయి ఉండవచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు. కాంటాక్ట్ కేసులను గుర్తించడంలో అధికారులు జాప్యం చేయడంతోనే కేసుల సంఖ్య మరింత పెరుగుతోంది. అలాగే కరోనా లక్షణాలు ఉన్న వారికే పరీక్షలు చేయడంతో మిగతా వారిని గుర్తించలేకపోతున్నారు. ఒకే కుటుంబంలో ఇద్దరు ముగ్గురికి వైరస్ సోకడంతో కలకలం రేపుతోంది. సామాజిక వ్యాప్తి అంతగా లేకున్నా నిర్లక్ష్యం చేస్తే ముప్పు తప్పదన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఈ దశలో మాస్కులు ధరించి తప్పని సరిగా భౌతిక దూరం పాటించాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కరోనా వైరస్ విజృంభిస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ భౌతికదూరాన్ని పాటించాలన్నారు. బయటకు వెళ్లే సమయంలో మాస్కులను ధరించాలని, అవసరమైతే తప్ప ప్రయాణాలను వాయిదా వేసుకోవాలన్నారు. కరోనాకు పూర్తిస్థాయి వైద్యం అందుబాటు లోకి వచ్చేంత వరకు ప్రజలంతా అప్రమ త్తంగా ఉంటే మంచిదని, వైరస్ కట్టడికి ప్రజల సహకారం ఎంతో అవసరం అంటున్నారు.

దేశంలో రైతులకు పంటలు అమ్ముకునే స్వేచ్ఛ

డిమాండ్ మేరకు పంటలకు ధరల లభ్యత
తెలంగాణ ఎంపిలు అరవింద్, సోయం బాపూరావు

న్యూఢిల్లీ,సెప్టెంబర్21(ఆర్ఎన్ఎ): కేంద్రం తీసుకుని వచ్చిన వ్యవసాయ బిల్లు వల్ల దశాబ్దాల పాపాలు పోతాయని, రైతుల పరంగా చూస్తే నిజంగా వరం లాంటిదని బిజెపి తెలంగాణ ఎంపిలు అన్నారు. .రైతే రాజు అవుతాడని బీజేపీ ఎంపీల ధర్మపురి అరవింద్,సోయం బాపూరావులు పేర్కొన్నారు. అందుకే బిల్లుని చూసి కేసీఆర్ ఉల్లిక్కిపడుతున్నాడని వారు ఎద్దేవా చేశారు. ఒక పక్క ఇప్పటికి రైతులు మద్దతు ధర కోసం రోడ్లు ఎక్కుతున్నారు.. 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో రైతులకి అన్యాయం జరిగిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ బిల్లు తీసుకువస్తామని కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పెట్టింది.. గాంధీ కుటుంబ అనంబద్ధమైన రాజకీయాల వల్ల ఈరోజు వాళ్ళ పరిస్థితి ఎలా ఉందో తెలుసు.. ఈ బిల్లు వల్ల రైతు పంట ఎక్కడ ఎప్పుడు అమ్ముకోవాలో రైతు నిర్ణయించుకోవచ్చన్నారు. అనేకమంది ఎప్పటినుంచో పంటల అమ్మకాలపై రైతులకు స్వేచ్ఛ ఉండాలని కోరుతున్న విషయాన్ని వారు గుర్తు చేశారు. బిల్లు వల్ల రైతులకు చాలా మంచి జరుగుతుందన్నారు. ఈ బిల్లు వల్ల రైతు అమ్మిన వస్తువుకి అదే రోజు డబ్బులు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. రైతు దేశంలో ఏ రాష్ట్రంలో అయిన పంట అమ్ముకోవచ్చు.. రాష్ట్రాలు కూడా రైతులపై టాక్స్ వేయడానికి వీలు లేదని ఆయన వివరించారు. మోడీకి, కేసీఆర్‌కి చాలా వ్యత్యాసం ఉంది?. కేశవరావు మస్క కొట్టుకుంటూ టిఆర్ఎస్ లో ఉన్నాడు? 60 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎందుకు ఇలా దిగజరిపోతున్నారు.. కేటీఆర్ మార్కెట్ యార్డులతో కుమ్మక్కవుతున్నాడు.. మార్కెట్ యార్డులో చాలా అవినీతి ఉంది? తమ వాటా తగ్గుతుందని కేసీఆర్ భయపడుతున్నాడు.. తెలంగాణలో కల్వకుంట్ల టాక్స్ ఉందని ప్రజలకు తెలియాలని ఎంపీ అరవింద్ పేర్కొన్నారు. రాష్ట్రంలో పనికిమాలిన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీ ..ఇది ఫ్రెండ్లీ ప్రతిపక్షం అని ఎంపీ అరవింద్ విమర్శించారు. వ్యవసాయ బిల్లును ప్రాంతీయ పార్టీలు ఎందుకు వ్యతిరేకంగా ఉన్నాయో తెలియడం లేదని సోయం బాపూరావు అన్నారు. కేంద్రం తెచ్చిన వ్యవసాయ బిల్లు వల్ల రైతులకు లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. ఈ బిల్లుతో దళారీ వ్యవస్థ పూర్తిగా పోతుందన్నారు. అలాగే రైతు ఎలాంటి నష్టం లేకుండా పంటను అమ్ముకోవచ్చన్నారు. తెలంగాణలో ఈ దళారిల వ్యవస్థ ఎక్కువగా ఉంది.. ఈ దళారీలు టిఆర్ఎస్ పార్టీ నాయకులేనని ఆయన విమర్శించారు. వీరంతా తమకు ఉపాధి పోతుందన్న బెంగలో విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు.

పంటలు అమ్ముకోవడంలో రైతులకు స్వేచ్ఛ

ఎక్కడైనా ఉత్పత్తులను అమ్ముకోవచ్చు
నచ్చినరేటుకు ఎక్కడైనా అమ్ముకునే అవకాశం
బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవియల్ వెల్లడి

న్యూఢిల్లీ,సెప్టెంబర్21(ఆర్ఎన్ఎ): కేంద్రం చేసిన చట్టం ద్వారా రైతులు తమ ఉత్పత్తులను అమ్ముకునే స్వేచ్ఛ ఉంటుందని బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవియల్ నరసింహారావు తెలిపారు. మార్కెట్ యార్డుల బయట కూడా రైతుల నుంచి నేరుగా ఎవరైనా కొనుగోలు చేయవచ్చన్నారు. వారి ఉత్పత్తులకు డిమాండ్ వస్తుందని అన్నారు. అలాగే తమకు నచ్చినరేటుకు ఎక్కడైనా అమ్ముకునే అవకాశం ఏర్పడుతుందని అన్నారు. తాజా బిల్లుతో మార్కెట్ యార్డులకు, ఏజెంట్లకు ఎటువంటి రుసుములు చెల్లించనవరం లేదని స్పష్టం చేశారు. మార్కెట్ యార్డులు బంద్ అయిపోతాయని వివక్షాలు అబద్దాలను ప్రచారం చేస్తున్నారని ఆయన మండి పడ్డారు. రైతలకు, కొనుగోలుదారులకు మధ్య వ్యవసాయ ఉత్పత్తుల మధ్య మాత్రమే ఒప్పందాలు జరుగుతాయని చెప్పారు. రైతుల ఆదాయం పెంచే ఉద్దేశంతో 2022 నాటికి రెట్టింపు కావాలనే మోదీ ఈ విప్లవాత్మకమైన నిర్ణయం చేశారని పేర్కొన్నారు. 2003లోనే ఇటువంటి సవరణలు చేయాలని చెప్పినా.. ఆనాడు చేయలేదని అన్నారు. రైతు కష్టాలను గుర్తించే.. మోదీ ఈరోజు ఆ చట్టం చేశారనేది అందరూ గుర్తించాలని చెప్పుకొచ్చారు. ఇప్పటి వరకు రైతులకు సంకెళ్లు వేసి.. మార్కెట్ యార్డులలో కమిషన్ ఏజెంట్ల ద్వారానే అమ్ముకోవాల్సి ఉందని, మధ్యవర్తులు పరిస్థితిని బట్టి వారి దయాదాక్షణ్యాలతో రైతుకు ధర నిర్ణయించేవారన్నారు. ఇప్పుడు అలా కాకుండా.. రైతులకు అన్ని విధాలా మేలు చేసేలా మోదీ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. నాలుగు లక్షల 95వేల కోట్ల ధాన్యాన్ని బీజేపీ ప్రభుత్వం కొనుగోలు చేసిందని... కాంగ్రెస్ కన్నా 2.4రెట్లు అధికంగా ధర ఇచ్చి రెట్టింపు ఉత్పత్తులను కొనుగోలు చేశామని తెలిపారు. రైతు వ్యవసాయ ఖర్చుల కన్నా కనీస మద్దతు ధర యాభై శాతం అధికంగా ఉండేలా మోదీ ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. నిజమైన రైతు బంధువు మోదీ అని.. అందుకే వారి సంక్షేమంకోసం ఆలోచిస్తున్నారని అన్నారు. రైతులకు నిజమైన స్వాతంత్య్రం నిన్నే వచ్చిందని తాను భావిస్తున్నానని అన్నారు. కాంగ్రెస్ ప్రచారం చేస్తున్న అసత్యాలను అందరూ తిప్పికొట్టాలని.. వారి హయాంలో రైతును మోసం చేసిన తీరును ప్రజలకు వివరించాలని జీవీఎల్ పిలుపునిచ్చారు.

లంచం కేసులో పోలీస్ కస్టడీకి ఐదుగురు నిందితులు

-చంచల్ గూడ జైలు నుంచి అదుపులో తీసుకున్న ఎసిబి

హైదరాబాద్,సెప్టెంబర్21(ఆర్ఎన్ఎ): మెదక్ జిల్లా నర్సాపూర్ లంచం కేసులో ఐదుగురు నిందితులను అవినీతి నిరోధక శాఖ(అనిశా) అధికారులు కస్టడీలోకి తీసుకున్నారు. కేసు విచారణలో భాగంగా ఈనెల 24వ తేదీ వరకు న్యాయస్థానం నిందితులను కస్టడీకి అనుమతించింది. దీంతో చంచల్ గూడ జైల్లో రిమాండ్ ఖైదీలుగా ఉన్న మెదక్ అదనపు కలెక్టర్ నగేశ్, ఆర్డీవో అరుణారెడ్డి, తహసీల్దార్ అబ్దుల్ సత్తార్, జూనియర్ అసిస్టెంట్ వసీమ్ అహ్మద్, నగేశ్ బినామీ జీవన్‌గౌడ్‌లను బంజారాహిల్స్‌లోని అవినీతి నిరోధక శాఖ ప్రధాన కార్యాలయానికి తీసుకొచ్చారు. కొవిడ్ నిబంధనలు పాటిస్తూ నిందితులకు పీపీఈ కిట్లు వేసి ప్రశ్నిస్తున్నారు. కేసులో ఎవరి పాత్రయినా ఉందా అనే కోణంలో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ మేరకు నిందితుల నుంచి వివరాలు సేకరించే పనిలో పడ్డారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలికి చెందిన మూర్తి అనే రైతుకు మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం చిప్పలతుర్తిలో 112 ఎకరాల పట్టా భూమి ఉంది. ఈ భూమికి సంబంధించి ఎన్‌వోసీ ఇవ్వాలని మూర్తి ఇటీవల అదనపు కలెక్టర్ నగేశ్‌ను సంప్రదించారు. ఎన్‌వోసీ ఇచ్చేందుకు తనకు ఎకరాకు రూ.లక్ష చొప్పున రూ.1.12 కోట్లు ఇవ్వాలని అదనపు కలెక్టర్ డిమాండ్ చేశాడు. ఇప్పటికే రూ.40లక్షల నగదు తీసుకున్న ఆయన.. మరో రూ.72లక్షల కోసం ఐదు ఎకరాల భూమిని తన బినామీ జీవన్‌గౌడ్ పేరుమీద అగ్రిమెంట్ చేయించుకున్నారు. ఈ నేపథ్యంలో బాధితుడు అనిశా అధికారులను సంప్రదించి ఆధారాలు సమర్పించడంతో రంగంలోకి దిగిన అనిశా అధికారులు ఐదుగురు నిందితులను అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

వైకాపా నేతల వ్యాఖ్యలపై నిరసనలు

-వైవి, మంత్రి నానిలు క్షమాపణలు చెప్పాలి: టిడిపి

తిరుపతి,సెప్టెంబర్21(ఆర్ఎన్ఎ): తిరుమల పవిత్రత దెబ్బతీసేలా టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి చర్యలున్నట్లు ఎమ్మెల్సీలు గౌనివారి శ్రీనివాసులు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పులివర్తి నాని ఒక ప్రకటనలో విమర్శించారు. శ్రీవారి దర్శనార్థం వచ్చే అన్య మతస్తులు డిక్లరేషన్ ఇవ్వాల్సిన అవసరం లేదని వైవీ ప్రకటించడం తిరుమల ఆలయ నిబంధనలకు తూట్లు పొడిచేలా ఉందని మండిపడ్డారు. అన్య మతస్తులు కొండమీద ఏమైనా చేసుకోవచ్చనడం శ్రీవారి భక్తులు, హిందువుల మనోభావాలను దెబ్బతీయడమే అన్నారు. సీఎం జగన్ పాలనలో తిరుమల పవిత్రతను దెబ్బతీసే ఘటనలు అధికంగా జరుగుతున్నాయని గుర్తుచేశారు. ఆలయ సాంప్రదాయాలు, హైందవధర్మాన్ని గౌరవించని వారు కీలక పదవుల్లో ఉండటం సరికాదని స్పష్టం చేశారు. గత కొద్ది రోజులుగా చంద్రబాబు అంటేనే విరుచుకు పడుతున్న ఏపీ మంత్రి కొడాలి నాని మళ్ళీ చంద్రబాబు మీద విరుచుకు పడడం వెనక ఆయన దుర్బుద్ధి దాగుందని గౌనిగాని శ్రీనివాసులు అన్నారు. చంద్రబాబుపై ఇష్టం వచ్చిన వ్యాఖ్యలు చే÷-తే ఊరుకునేది లేదన్నారు. జగన్ మెప్పుకోసమే తిరుమల డిక్లరేషన్స్ విషయంలో సంచలన వ్యాఖ్యలు చేసినట్లు అర్థం అవుతోందన్నారు. దేవాలయాలపై వరుస ఘటనల విషయంలో అనుమానాలు ఉన్నాయని అన్నారు. కనకదుర్గమ్మ ఆలయంలో 10 కేజీల వెండి బొమ్మలు ఎత్తుకు పోతే...కోటి రూపాయల రథం పోతే దేవుడికి పోయేది ఏమి లేదనే ధోరణిలో నాని ఉన్నారని మండిపడ్డారు. టీటీడీ నిధులను బాండ్ల రూపంలో తరలించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఎవడబ్బ సొమ్మని తరలిస్తారు. దీన్ని వెంటనే విరమించుకోవాలని మాజీమంత్రి అమరనాథరెడ్డి డిమాండ్ చేశారు. తిరుమల ప్రతిష్ఠను దిగజార్చేలా బోర్డు వ్యవహరిస్తోందని ఆరోపించారు. తాను క్రిస్టియన్ అని చెప్పుకొనే సీఎం తిరుమల దర్శనానికి వస్తే డిక్లరేషన్ అవసరం లేదంటారా? దీన్నిబట్టి చూస్తే కేవలం రాజకీయ లబ్ది పొందడానికే సీఎం హిందూ దేవాలయాలను సందర్శిస్తున్నట్లు తెలుస్తోందని విమర్శించారు.

వివాదాల చుట్టూ రాష్ట్ర రాజకీయాలు

చలి కాచుకుంటున్న బిజెపి,టిడిపిలు
కేంద్రం తీరు ఎగదోసేదిగా ఉందన్న సిపిఎం

విజయవాడ,సెప్టెంబర్21(ఆర్ఎన్ఎ): ప్రజా సమస్యలను విస్మరించి అధికార, ప్రతిపక్ష పార్టీలు రాజకీయ వివాదాల చుట్టూ తిరుగుతున్నారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వ వివాదాస్పద నిర్ణయాలపై కోర్టులు మొట్టికాయలు వేస్తున్నా పట్టించుకోవడం లేదని సిపి(ఐ)ఎం కేంద్రకమిటీ సభ్యుడు వి. శ్రీనివాసరావు అభిప్రాయపడ్డారు. సిఆర్‌డిఏ, రాజధాని వికేంద్రీకరణ బిల్లులపై స్టే, ఎన్నికల కమిషన్ పున:నియామకం, తెలుగు మీడియం, శాసనమండలి రద్దు, మానవ హక్కుల ఉల్లంఘనలపై కోర్టు ప్రతికూల తీర్పులిచ్చినా దిద్దుకోవడానికి బదులు లిటిగేషన్లు కొనసాగిస్తున్నదని అన్నారు. రాష్ట్ర పాలన ఎక్కే మెట్లు, దిగే మెట్లు అన్నట్లు కోర్టుల చుట్టూ తిరుగుతున్నదని వ్యాఖ్యానించారు. తెలుగుదేశం ప్రచారమంతా బిజెపి ఎజెండాను ముందుకు నెట్టడానికే తోడ్పడుతుందని మండిపడ్డారు. లౌకిక పార్టీగా వున్న టిడిపి ఈ రకంగా మతోన్మాద భావాలను ప్రేరేపించడం రాష్ట్ర రాజకీయాలకు ఎనలేని హాని చేస్తుందన్నారు. భస్మాసుర హస్తం లాగా తెలుగుదేశం పతనానికే దారితీస్తుంది. గత ఆరేళ్లలో బిజెపి పెత్తనానికి దాసోహమన్న ప్రాంతీయ పార్టీలకు ఇదే గతి పట్టింది. ప్రజల రోజువారీ సమస్యలు తీసుకొని పని చేస్తే తెలుగుదేశం మనుగడ నిలబడుతుంది తప్ప ఇలా చౌకబారు రాజకీయాలకు లోబడిపోతే ఆత్మహత్యా సదృశ్యం అవుతుందన్నారు. మోడీపై ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను దారి మళ్ళించడానికి బిజెపి కొత్త యత్నాలను మొదలుపెట్టిందన్నారు. కొత్తగా రాష్ట్ర అధ్యక్షుడిగా మరొకరిని నియమించి మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తోంది. ప్రజల సమస్యల్ని పట్టించుకోకుండా రాష్ట్ర రాజకీయాల ఎజెండాను మతం మీదకు మళ్ళించే ప్రయత్నం చేస్తున్నది. వీరి దుష్ట పథకాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలు కూడా సహకరిస్తున్నాయి. అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అటు ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వ చర్యలకు మద్దతునిస్తూ, ఇటు రాష్ట్రంలో బిజెపితో రాజీ పడుతున్నదని ఆయన ఘాటుగా విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అండ, రాష్ట్ర అధికార, ప్రతిపక్ష పార్టీల పరోక్ష తోడ్పాటును బిజెపి అవకాశంగా మలచుకోవాలని చూస్తున్నది. దానికి మతాన్ని సాధనంగా వాడుకుంటున్నది. అంతర్వేదిలో రథం కాలిపోయిన దుర్ఘటనను ఉపయోగించుకొని హిందువుల మనోభావాలను రెచ్చగొట్టేందుకు వెనువెంటనే రంగంలోకి దిగిందని గుర్తు చేశారు. దేవాలయాలు, ప్రార్థనా మందిరాలకు రక్షణ కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తున్నదని విమర్శించారు. జరిగిన ఘటనలపై వెనువెంటనే స్పందించి చర్యలు తీసుకోవడంలో తాత్సారం చేయడంలో మతలబు ఏంటన్నారు. ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకు బిజెపి దీన్ని వాడుకుంటున్నదన్నారు. ధర్మ దీక్షలు పేరుతో పవన్ కళ్యాణ్ రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. ఇదే అదునుగా తెలుగుదేశం కూడా రంగంలోకి దిగింది. ఈ మూడు పార్టీలు మతాభిమానాలను ఉపయోగించు కొని రాజకీయంగా లాభపడాలని చూస్తున్నాయి. రాష్ట్రంలో క్రైస్తవ రాజ్యం నడుస్తున్నదని బిజెపి ప్రచారం చేస్తున్నది. హిందూ దేవాలయాలపై దాడులు జరుగుతున్నాయని, తెలుగుదేశం ఏకంగా ఒక కరపత్రాన్నే ప్రచురించిందన్నారు. రాష్ట్రంలో బిజెపి మతోన్మాదాన్ని, ఆర్థిక సంస్కరణలను ధైర్యంగా ఎదిరించి నిలబడుతున్నది వామపక్ష పార్టీలు మాత్రమేనని అన్నారు. అందువలనే వామపక్షాలపై బిజెపి నిరంతరం తప్పుడు ప్రచారం చేస్తున్నది. కేంద్ర నాయకత్వంపై అక్రమ కేసులు పెట్టి వేధించాలని, కమ్యూనిస్టులపై తప్పుడు ప్రచారం చేసి అప్రదిష్టపాలు చేయాలని చూస్తున్నదన్నారు. కరోనాలో అత్యంత ఆదర్శంగా నిలబడ్డ కేరళలో వామపక్ష ప్రభుత్వాన్ని దెబ్బదీయడం లక్ష్యంగా బిజెపి పని చేస్తున్నదని దుయ్యబట్టారు. కరోనా కష్టకాలంలో సిపిఐ(యం), వామపక్షాలు ప్రజల్ని అంటిపెట్టుకొని ధైర్యంగా సేవా కార్యక్రమాలు నిర్వహించి అందరి మన్ననలను పొందుతున్నది. ప్రజా సమస్యలపై స్పందించి కరోనా నిబంధనలకు లోబడి ఆందోళనలు చేస్తున్నది. తద్వారా దేశ రాజకీయాలకు మార్గనిర్దేశం చేస్తున్నది. బిజెపి మతోన్మాద దూకుడును నిలువరించేందుకు వామపక్షాల ఎదుగుదల మాత్రమే పరిష్కారం అన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంలో టిడిపి విఫలమైంది. వైఎస్సార్ కాంగ్రెస్ దగ్గర భిన్నమైన విధానాలు లేవు. వామపక్ష రాజకీయాలు పురోగమనం వైపుగా నడుస్తాయన్నారు.

ఎర్నాకుళంలో పేలుడు
ఇద్దరు కూలీలు మృతి

తిరువనంతపురం,సెప్టెంబర్21(ఆర్ఎన్ఎ): కేరళలోని ఎర్నాకుళంలో సోమవారం ఉదయం భారీ పేలుడు చోటుచేసుకుంది. ఈ ఘటన మలయూర్‌లో తవ్వకాలు జరుపుతుండగా జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు కూలీలు మృతి చెందారు. మరికొందరు కూడా మృతి చెందివుండవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంఘటనా స్థలంలో సహాయక చర్యలు చేపడుతున్నారు. కలూడీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ పేలుడు ఒక భవనంలో చోటుచేసుకుంది. ఈ భవనాన్ని కూల్చివేసేందుకు ప్రయత్నిస్తుండగా భారీ పేలుడు సంభవించింది. మృతులను తమిళనాడుకు చెందిన పెరియానాన్, కర్నాటకకు చెందిన డీ నాగాగా పోలీసులు గుర్తించారు.

మహబూబాబాద్‌లో లబ్దిదారులకు సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను అందచేసిన ఎమ్మెల్యే శంకర్ నాయక్

పైసలిచ్చి రోగాలను కొనుక్కుంటున్నాం..

మహబూబ్ నగర్, సెప్టెంబర్ 21: హైదరాబాద్ లోని మంత్రుల నివాస సముదాయంలో వనపర్తి జిల్లాలోని మిషన్ భగీరథ పనులపై ఉన్నతాధికారులతో వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి, ఈఎన్సీ కృపాకర్ రెడ్డి, సీఈ చిన్నారెడ్డి, ఎస్ఈ జగన్మోహన్, ఈఈలు మేఘారెడ్డి, సుధాకర్ సింగ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..ప్రజలకు మిషన్ భగీరథ నీళ్ల ప్రాధాన్యం వివరించాలని సూచించారు. ఫిల్టర్ నీళ్లతో అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

సకల అనారోగ్యాలకు ఫిల్టర్ నీళ్లే కారణమని మంత్రి తెలిపారు. మిషన్ భగీరథ నీళ్లు తాగితే సగం రోగాలు దూరమవుతాయని వివరించారు. మినరల్, ఫిల్టర్ వాటర్ పేరుతో పైసలిచ్చి రోగాలను కొనుక్కుంటున్నాం. ప్రజలను చైతన్యం చేసి ఈ అలవాటును మాన్పించాలని అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ మిగిలిపోయిన ఇబ్బందులపై దృష్టిపెట్టండి. లీకేజీలు, అసంపూర్తి పనులు సరిచేయాలని ఆదేశించారు. వనపర్తి జిల్లాలో తాగునీటికి భవిష్యత్ లో ఏ ఇబ్బందులూ ఉండకూడదన్నారు.

గిరిజన తండాలు, దళిత వాడలకు మిషన్ భగీరథ నీటి కనెక్షన్ల విషయంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని పేర్కొన్నారు. ప్రతి ఇంటికి నీరందాలి. డిసెంబరుకు వంద శాతం స్థిరీకరణ పూర్తి కావాలి స్పష్టం చేశారు. అప్పాయపల్లి, పెద్దగూడెం, చిట్యాల సమీపంలో నిర్మిస్తున్న డబల్ బెడ్ రూం ఇండ్లకు వెంటనే కనెక్షన్లు ఇవ్వండని అధికారులను ఆదేశించారు. పాన్ గల్ సమీపంలో నిర్మిస్తున్న వేర్ హౌసింగ్ గోదాంల వద్ద ఉద్యోగులు, హమాలీల గృహాలు రానున్నాయి. అక్కడ కూడా మిషన్ భగీరథ కనెక్షన్లు ఇవ్వాలని మంత్రి సూచించారు.

యుద్ధనౌకలపై హెలీకాప్టర్లు నడపనున్న మహిళా అధికారిణులు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 21: భారత యుద్ధనౌకలలో ఇద్దరు మహిళా నేవీ అధికారిణిలను నియమించారు. సబ్ లెఫ్టినెంట్ కుముదిని త్యాగి, సబ్ లెఫ్టినెంట్ రితి సింగ్ దీని కోసం ఎంపికయ్యారు. కొచ్చిలోని ఐఎన్ఎస్ గరుడాలో సోమవారం జరిగిన కార్యక్రమంలో గ్రాడ్యుయేట్ 'వింగ్స్' ప్రధానం చేశారు. యుద్ధ నౌకలలోని హెలీకాప్టర్ల విభాగంలో వైమానిక వ్యూహకర్తలుగా వారు వ్యవహరిస్తారు. యుద్ధ నౌకల్లో మహిళా నేవీ అధికారిణిలను నియమించడం ఇదే తొలిసారి. ఇప్పటి వరకు నౌకా కేంద్రాల్లోని హెలీకాప్టర్లను మహిళా అధికారిణులు నడిపేవారు. ఇప్పుడు తొలిసారిగా యుద్ధ నౌకపై కూడా హెలీకాప్టర్లను సబ్ లెఫ్టినెంట్ కుముదిని త్యాగి, సబ్ లెఫ్టినెంట్

54వ డివిజన్లో మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారుల పర్యటన

కరీంనగర్ సెప్టెంబర్ 21(నేటినిజం ప్రతినిధి): :- ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి 54 డివిజన్ పరిధిలో కశ్మీరగడ్డ ప్రాంతంలో పలు వీధులు జలమయమయ్యాయి. ఇండ్లలో వరదనీరు చేరి బురధమయంగా మారాయి. దీనికి తోడు కరెంటు పోవడంతో అర్ధరాత్రి కాలనీవాసుల కష్టాలు అంతా ఇంతకాదు. తన డివిజన్ లో నెలకొన్న విపత్కర పరిస్థితులను కార్పొరేటర్ ఇఫ్రా తఫ్సీన్-ఆతిన, మేయర్ సునీల్ రావు, కమిషనర్ వల్లూరు క్రాంతి కి విన్నవించారు. స్పందించిన మేయర్, కమిషనర్ లు మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులను డివిజన్ కు వెళ్లి పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించారు. ఈమేరకు సోమవారం మున్సిపల్ అధికారులు 54వ డివిజన్ లో పర్యటించారు. భారీ వర్షం ధాటికి జరిగిన నష్టాన్ని అంచనా వేశారు. వరదనీరు వెళ్లే మార్గాన్ని, మ్యాన్ హ్వల్స్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇఇ రామన్, ఎఇ వెంకట్ కుమార్, కార్పొరేటర్ ఇఫ్రా తఫ్సీన్-ఆతిన, డివిజన్ పెద్దలు పాల్గొన్నారు.

పేదింటి ఆడపిల్లలకు పెద్దన్న కెసిఆర్

కల్యాణలక్ష్మిచెక్కుల పంపిణీలో మంత్రి ఎర్రబెల్లి

వరంగల్ రూరల్,సెప్టెంబర్21 (ఆర్ఎన్ఎ): పేదింటి ఆడ బిడ్డల పెండ్లికి పెద్దన్నగా మారి సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి,షాదీ ముబారక్ చెక్కులు అందిస్తూ కొండంత అండగా నిలుస్తున్నాడని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ అన్నారు. పేదల పెళ్లిళ్లకు ఆర్జక అడ్డంకులు లేకుండా పథకాన్ని కొనసాగిస్తున్నారని అన్నారు. దేశంలో ఎక్కడా ఇలాంటి పథకం అమలు కావడం లేదన్నారు. రాయపర్తి మండల కేంద్రం ఎంపీడీవో కార్యాలయంలో 126 మంది లబ్దిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. పేదింటి ఆడబిడ్డల పెండ్లిండ్లకు కట్నంగా కల్యాణలక్ష్మి, షాదీ ముబార్ చెక్కులు అందించి పేదల కష్టాల్లో పాలుపంచుకుంటున్నారని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ నూతన ఆలోచనలతో రాష్ట్రం బంగారు తెలంగాణగా మారుతుందన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

అక్రమ కార్యకలాపాలపై రెండోరోజు కొనసాగిన పోలీసుల దాడులు

కరీంనగర్, సెప్టెంబర్ 21 (నేటినిజం ప్రతినిధి): కరీంనగర్ కమిషనరేట్ పోలీసులు రెండోరోజుకూడా అక్రమ కార్యకలాపాలపై దాడులను కొనసాగించారు. అక్రమ కార్యకలాపాల నియంత్రణపై పోలీసుల దూకుడు పెరుగుతోంది. ఆదివారం నాడు అక్రమ ఇసుక రవాణాకు పాల్పడిన వివిధ రకాల వాహనాలు, పేకాటరాయుళ్ళులను, నిషేదిత పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తున్న, సరఫరా చేస్తున్న వ్యక్తులపై కేసులను నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.

పొగాకు ఉత్పత్తుల స్వాధీనం కేసుల నమోదు

కేశవపట్నం పోలీసులు భారీగా 5,25,000రూపాయల విలువచేసే నిషేదిత పొగాకు ఉత్పత్తులు, గంజాయిని సరఫరా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన మేడి రాము, కోటపల్లికి చెందిన గాజంగి ప్రవీణ్‌లు ఒకకారు నెంబర్ టిఎస్19 సి 6456లో గోదావరిఖని ప్రాంతం నుండి 5,25,000రూపాయల విలువచేసే పొగాకు ఉత్పత్తులు, 13,500 రూపాయల విలువచేసే గంజాయిని అక్రమంగా సరఫరా చేస్తుండగా మొలంగూరు క్రాస్‌రోడ్డువద్ద నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఎస్ఐ రవి ఆధ్వర్యంలో పట్టుకున్నారు. తహసిల్దార్ సమక్షంలో పంచనామా నిర్వహించి కేసునమోదు చేశారు.

హుజురాబాద్ మండలంలోని కాట్రపల్లిలో ఒక కిరాణం దుకాణంపై దాడిజరిపి 3660రూపాయల విలువచేసే నిషేదిత పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. విక్రయదారుడు సుద్దాల రామయ్యపై కేసునమోదు చేశారు. జమ్మికుంట పోలీసులు నాలుగుప్రాంతాల్లో దాడులను నిర్వహించి 22,800రూపాయల విలువచేసే నిషేదిత పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. కరీంనగర్ రూరల్ పోలీసులు చెర్లభూత్కూరు గ్రామంలో 22,500రూపాయల విలువచేసే నిషేదిత పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకుని విక్రయదారుడు గాజుల పురుషోత్తంపై కేసు నమోదు చేశారు. తీగలగుట్టపల్లిలోని వైష్ణవి కిరాణం దుకాణంపై దాడిజరిపి 3160రూపాయల విలువచేసే నిషేదిత పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకుని, విక్రయదారుడు గుండా సతీష్‌పై కేసునమోదు చేశారు. చొప్పదండి పోలీసులు ఒకదుకాణంపై దాడిజరిపి 3300రూపాయల విలువచేసే పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకుని వ్యాపారి దుంపేటి బానయ్యపై కేసునమోదు చేశారు. రామడుగు పోలీసులు మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలో మూడుప్రాంతాల్లో దాడులు నిర్వహించి 5300రూపాయల విలువచేసే నిషేదిత పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకుని ముగ్గురు విక్రయదారులు బండారి రాములు, చల్ల అంజయ్య, బొడ్డు సత్యంలపై కేసులను నమోదు చేశారు. గన్నేరువరం పోలీసులు జంగంపల్లిలో దాడిజరిపి రెండువేల రూపాయల విలువచేసే నిషేదిత పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకుని విక్రయదారుడు పెద్ది భాస్కర్‌పై కేసు నమోదు చేశారు. వీణవంక పోలీసులు 7020 రూపాయల విలువచేసే నిషేదిత పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసునమోదు చేశారు. కరీంనగర్ టూటౌన్ పోలీసులు సప్తగిరికాలనీలో దాడిజరిపి 1255రూపాయల విలువచేసే పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకుని విక్రయదారుడు మ్యాకల కొమురయ్యపై కేసు నమోదు చేశారు. గంగాధర పోలీసులు ఉప్పరమల్యాల గ్రామంలో ఒక దుకాణంపై దాడి జరిపి 1070రూపాయల నిషేదిత పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకుని విక్రయదారుడు మంచాల శంకరయ్యపై కేసునమోదు చేశారు.

పేకాటరాయుళ్ళ అరెస్ట్

మానకొండూరు మండలంలోని ముంజంపల్లిలో పేకాట ఆడుతున్న ముగ్గురువ్యక్తులను పోలీసులు రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు.అరెస్టు చేశారు. వారివద్ద నుండి 2400రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. కరీంనగర్‌రూరల్ పోలీసులు బొమ్మకల్‌లోని లారీ అసోసియేషన్ కార్యాలయం సమీపంలో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. వారివద్ద నుండి 6680రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. చిగురుమామిడి పోలీసులు రేకొండ గ్రామశివారులో పేకాట ఆడుతున్న 12మందిపై కేసు నమోదు చేశారు. వారివద్ద నుండి 23వేల రూపాయలను స్వాధీనం చేసుకున్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

హుజురాబాద్ పోలీసులు బ్లూకోల్ట్స్ పోలీసుల సహకారంతో మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. ముగ్గురు డ్రైవర్లు, ఇద్దరు ట్రాక్టర్ల యజమానులను బైండోవర్ చేశారు. రామడుగు పోలీసులు మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. కరీంనగర్ రూరల్ పోలీసులు తీగలగుట్టపల్లిలో ఒక ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. చిగురుమామిడిలో ఒక ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నారు.

ప్రభుత్వం సరఫరా చేసే పప్పు స్వాధీనం

జమ్మికుంట పోలీసులు ధర్మారం గ్రామంలో ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసే పప్పును అక్రమరవాణాకు సిద్ధంగా ఉంచిన 80కిలోలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పౌరసరఫరాశాఖ అధికారులకు అప్పగించారు.

నిర్లక్ష్యపు 'నాచు'



-విశ్వ హిందూ పరిషత్ ఆగ్రహం

వేములవాడ, సెప్టెంబర్ 21:వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి అనుబంధ దేవాలయమైన శ్రీ భీమేశ్వర ఆలయానికి పట్టిన నాచు, (పాకురు) అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా నిలుస్తున్నదని వి హెచ్ పి జిల్లా సహాయ కార్యదర్శి గడప కిషోర్ రావు విమర్శించారు.

ఇది భక్తుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

నాచును తొలగించి.. ఆలయ గోడలను, గోపురాన్ని శుభ్రపరచాలని ఆలయ అధికారులను కోరారు.

ఐపిఎల్‌లో బోణీ కొట్టిన ఢిల్లీ

-సూపర్ ఓవర్‌ను ఉపయోగించుకుని విన్నింగ్

దుబాయ్,సెప్టెంబర్21(ఆర్ఎన్ఎ): ఐపీఎల్ 13వ సీజన్‌లో ఢిల్లీ బోణి కొట్టింది. తొలి మ్యాచ్‌లోనే ఐపీఎల్ మజా ఎంటో చూపించింది. తొలుత ఢిల్లీ 8 వికెట్లు కోల్పోయి 157 పరుగులు చేయగా... పంజాబ్ కూడా

అన్నే పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ టైగా మారి సూపర్ ఓవర్‌కు దారి తీసింది. సూపర్ ఓవర్‌లో పంజాబ్ రెండు పరుగులకే రెండు వికెట్లు కోల్పోవడంతో ఇన్నింగ్స్ ముగిసింది. దీంతో ఢిల్లీ 3 పరుగులు చేసి ఈ సీజన్‌లో తొలి విక్టరీ నమోదు చేసింది. వాస్తవానికి రెండో ఇన్నింగ్స్ 19.4 ఓవర్లకు స్కోర్ సమం అయింది. రెండు బంతుల్లో ఒక రన్ కొట్టాల్సి ఉండగా, మయాంక్ అగర్వాల్ ఔట్ అయ్యాడు. ఫోర్ కొట్టబోయి క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఆ తర్వాత ఒక బాల్‌లో ఒక రన్ కావాల్సి ఉండగా, జోర్డాన్ కొట్టిన బంతిని రబాడా క్యాచ్ పట్టాడు. దీంతో రెండు జట్ల స్కోర్ సమం అయింది. సూపర్ ఓవర్‌కు దారి తీసింది. సూపర్ ఓవర్లో ఢిల్లీ బౌలర్ రబాడా బౌలింగ్ చేశాడు. మూడు బంతుల్లోనే కేఎల్ రాహుల్, పూరన్‌ను ఔట్ చేశాడు. సూపర్ ఓవర్లో రెండు వికెట్లు పడడంతో సూపర్ ఓవర్ ఫినిష్ అయిపోయింది. ఇక కింగ్స్ లెవన్ పంజాబ్ తరఫున షమీ బౌలింగ్ చేశాడు. శ్రేయాస్ అయ్యర్, రిషబ్ పంత్ బరిలోకి దిగారు. మొదటి బాల్ డాట్ బాల్. రెండో బంతి వైడ్. మూడో బంతికి రెండు రన్స్ వచ్చాయి. దీంతో ఢిల్లీ విజయం సాధించింది.

ఇక, మొదట బ్యాటింగ్ చేసిన ఢిల్లీ జట్టు 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 157 పరుగులు చేసింది. 158 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన కేఎల్ రాహుల్ టీమ్ మొదట్లో బాగానే ఆడింది. కేఎల్ రాహుల్ ఔట్ అయ్యాక మెల్లగా వికెట్లు పడ్డాయి. మధ్యలో స్కోర్ నెమ్మదించింది. మొదటి నుంచి క్రీజ్‌లో నిలిచిన మయాంక్ అగర్వాల్ మెల్ల మెల్లగా కుదురుకున్నాడు. చివర్లో దుమ్ము దులిపాడు. తన మీదున్న నమ్మకాన్ని నిలబెట్టుకున్నాడు. 59 బంతుల్లో 89 పరుగులు చేశాడు. అయితే స్కోర్ 157 వద్ద ఔటయ్యాడు. చివరి బంతికి ఒక్క రన్ కొడితే గెలిచే వేళ ఔట్ అయ్యాడు. లాంగ్ షాట్ ఫోర్ కొట్టాడు. కానీ, అది క్యాచ్ అయింది. అంతకు ముందు ఢిల్లీ ప్లేయర్ స్టొయినిస్ చివరి ఓవర్లలో చెలరేగి ఆడాడు. దీంతో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 157 పరుగులు సాధించింది.

యువ జర్నలిస్టు అజయ్ కుటుంబ సభ్యులకు ఆది పరామర్శ

వేములవాడ, సెప్టెంబర్ 21:అనారోగ్యంతో మృతి చెందిన యువ జర్నలిస్ట్ అజయ్ కుటుంబాన్ని సోమవారం కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్ పరామర్శించి . అజయ్ అకాల మరణంతో శోకసంద్రంలో ఉన్న వారి కుటుంబాన్ని ఓదార్చి వారి మృతి పట్ల తీవ్రగ్రాంతి వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ప్రజా సమస్యలపై ప్రజా పక్షం రిపోర్టర్ గా తనదైన శైలిలో స్పందిస్తూ .. సమస్యల పరిష్కారానికి కృషి చేశారని ఆది శ్రీనివాస్ గుర్తుచేశారు..

ఎపి పోలీస్ శాఖ మరో వినూత్న ప్రయోగం

అన్ని పోలీస్ స్టేషన్లను ఒకే గొడుగు కిందకు తెస్తూ యాప్ లాంఛనంగా ప్రారంభించిన సిఎం జగన్

యాప్ ద్వారా 87 రకాల సేవలు అందుబాటులోకి

అమరావతి,సెప్టెంబర్21(ఆర్ఎన్ఎ): పాలనలో ఇప్పటికే అనేక సంస్కరణలు తీసుకువచ్చిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దేశంలోనే తొలిసారిగా రాష్ట్ర పోలీస్ శాఖ సరికొత్త యాప్‌ను పరిచయం చేసింది. రాష్ట్రంలోని అన్ని పోలీస్ స్టేషన్లను అనుసంధానిస్తూ రూపొందించిన కొత్త యాప్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ యాప్ ద్వారా ప్రజలు పోలీస్ స్టేషన్‌కు వెళ్లే అవసరం లేకుండా 87 రకాల సేవలు అందుబాటులోకి రానున్నాయి. అన్ని నేరాలపై ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేసే అవకాశంతో పాటు ఫిర్యాదులకు రశీదు కూడా పొందే అవకాశం ఉంది. వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్ ద్వారా ఫిర్యాదులతో పాటు అత్యవసర సమయాల్లో వీడియో కాల్ చేసే సౌకర్యం కూడా ఉంది. ముఖ్యంగా మహిళల భద్రత కోసం ప్రత్యేకంగా 12 రకాల సేవలు అందుబాటులోకి రానున్నాయి. దర్యాప్తు పురోగతి, అరెస్టులు, ఎఫ్ఐఆర్‌లు, రికవరీలు, రహదారి భద్రత,.. సైబర్ భద్రత, మహిళా భద్రత, వివిధ కార్యక్రమాలకు అనుమతులు కూడా ఈ యాప్ ద్వారా పొందవచ్చు. వీటితో పాటు ఎన్‌వోసీలు, లైసెన్సులు, పాస్‌పోర్ట్ సేవలు, ఇతర వెరిఫికేషన్లు అన్ని పోలీసు సేవలను కూడా అందుబాటులో ఉంటాయి. మీడియాలో వైరల్ అయ్యే సమాచారాన్ని నిర్ధారించుకునే సౌకర్యం కూడా ఉంది. ఈ యాప్‌లో మహిళల భద్రత కోసం ప్రత్యేకంగా 12 మాడ్యూల్స్‌తో మహిళల కు రక్షణగా, తోడు నీడగా అన్ని వేళల్లో పోలీసులు తమకు రక్షణ ఉన్నారు అనే భావనతో వారిలో ఆత్మస్థైర్యాన్ని కల్పించే విధంగా ఈ యాప్ సేవలను అందిస్తుంది.

తాడేపల్లిలో జరిగిన ఈ కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్‌త్ పాటు డీజీపీ గౌతమ్ సవాంగ్ ముఖ్య పోలీసు అధికారులు పాల్గొన్నారు. యాప్ విశిష్టతను సీఎంకు వివరించారు. ఈ యాప్ ద్వారా పోలీసు వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు నాంది పలకనుందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. డిజిటలైజేషన్ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు ఈ పోలీస్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలనే సంకల్పంతో ఈ యాప్‌ను రూపొందించినట్లు డీజీపీ తెలిపారు. డీజీపీ గౌతమ్ సవాంగ్ మాట్లాడుతూ.. 'రాష్ట్రంలోని మహిళలకు అన్ని సందర్భాలలో అందుబాటులో ఉండే విధంగా అత్యంత ఆధునిక టెక్నాలజీ తో ప్రవేశ పెట్టిన దిశ మొబైల్ అప్లికేషన్ (ఎస్ఓఎస్) స్వల్ప వ్యవధి లోనే పదకొండు లక్షల మంది డౌన్ లోడ్ చేసుకున్నారు. 568 మంది నుంచి ఫిర్యాదులు స్వీకరించగా 117 ఎఫ్ఐఆర్‌లను నమోదు చేసి చర్యలు తీసుకున్నాము. ఆపదలో ఉన్న మహిళలకు తక్షణమే పరిష్కరించటం కోసం ఇప్పటికే సైబర్ మిత్ర ప్రత్యేక వాట్సాప్ నెంబర్ 9121211100 మరియు ఫేస్ బుక్ పేజ్ అందుబాటులో ఉంది. ఇప్పటివరకు 1,850 పిటిషన్ లు అందగా 309 యఫ్.ఐ.ఆర్ లు నమోదు చేసి చర్యలు తీసుకున్నాము. సైబర్ నేరాలను నియంత్రించేందుకు అత్యాధునిక టెక్నాలజీతో సైబర్‌ల్యాబ్స్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్ కు వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం.అత్యంత వెనుకబడిన ప్రాంతాల్లో కూడా రిమోట్ ఏరియా కమ్యూనికేషన్ ఎన్‌హాన్స్‌మెంట్ వెహికల్స్ (రేస్) విధానం అందుబాటులో ఉందన్నారు.

అవినీతిని అరికట్టేందుకే విఆర్వో వ్యవస్థ రద్దు

రైతు సమస్యలపై రాజీలేని కృషి: మంత్రి సత్యవతి

మహబూబాబాద్,సెప్టెంబర్21(ఆర్ఎన్ఎ): వీఆర్వో వ్యవస్థ వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సీఎం దానిని రద్దు చేశారని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ వివరించారు. ప్రజలకు మెరుగైన పాలన అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. నూతన రెవెన్యూ చట్టం, మున్సిపల్ చట్టం, ఎల్.ఆర్.ఎస్ కు అవకాశం, అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణ టీ.ఎస్ బీపాస్ రైతువేదికల నిర్మాణం తదితర అభివృద్ధి కార్యక్రమాలపై కలెక్టర్ కార్యాలయంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..అసెంబ్లీలో సభ్యుల కోరిక మేరకు సీఎం కేసీఆర్ ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తుకు మరోసారి అవకాశం కల్పించారని పేర్కొన్నారు. అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణకు జీవో 58,59 పొడగించారు తెలిపారు. ఏ ఒక్క రైతు రైతుబంధు, రైతుబీమా రాకుండా ఉండొద్దని సీఎం కేసీఆర్ ఆదేశాలు ఇచ్చారని తెలియజేశారు. పట్టాలిచ్చినా..అటవీ ప్రాంతంలో అధికారులు గిరిజనులను ఇబ్బంది పెడుతున్నారని చెబితే..దీనికి శాశ్వత పరిష్కారం కింద భూ సర్వే చేసి పట్టాలిస్తామని హామీ ఇచ్చారు. మున్సిపాలిటీ వ్యవస్థను గాడిలో పెట్టడమే లక్ష్యంగా సీఎం, మంత్రి కేటీఆర్ పని చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం పని చేస్తున్నారని తెలిపారు. మహబూబాబాద్ లో ఎల్.ఆర్.ఎస్ బాగా వినియోగించుకునేలా ప్రజలకు ప్రచారం కల్పించాలన్నారు. దసరా నాటికి రైతు వేదికలు ప్రారంభించాలన్నారు. జిల్లాలో మోడ్రన్ మార్కెట్, జిల్లా హాస్పిటల్, మెడికల్ కాలేజీ త్వరలోనే ఏర్పాటు కానున్నట్లు వివరించారు. కరోనా నివారణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. టీఎస్ బీపాస్ విధి విధానాలు రావాల్సి ఉందన్నారు. అలాగే రైతు వేదికల నిర్మాణం వేగవంతం చేయడం, రైతుకల్లాలు త్వరగా గుర్తించి ఏర్పాటుచేయడం, కోవిడ్ వ్యాప్తిని సమర్థవంతంగా నిరోధించడం, సకాలంలో మంచి వైద్యం అందించడం, ఇతర జిల్లా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలపై కూడా మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీ కవిత, జెడ్పీ చైర్‌పర్సన్ అంగోత్‌బిందు, ఎమ్మెల్యే శంకర్‌నాయక్, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, కలెక్టర్ విపిగౌతం, మున్సిపల్ కమిషనర్ ఇంద్రసేనారెడ్డి, ,కోవిడ్ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ సతీష్‌రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే ముఖ్యం

పార్టీ శ్రేణులకు మంత్రి పువ్వాడ ఆదేశం

భద్రాద్రి కొత్తగూడెం,సెప్టెంబర్21 (ఆర్ఎన్ఎ): రానున్న ఖమ్మం-వరంగల్-నల్గొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆదేశించారు. ఈ మేరకు సన్నాహక సమావేశంలో భాగంగా భద్రాచలం, పినపాక నియోజకవర్గాల స్థాయి సమావేశం భద్రాచలం లోని కేకే ఫంక్షన్ హాల్ లో జరిగింది. ముఖ్య అతిథిగా రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ హాజరై పార్టీ శ్రేణులతో మాట్లాడారు. పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పని చేయాలని పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు మనకు ప్రతిష్టాత్మకమని వివరించారు.పార్టీ శ్రేణులు దీన్ని సీరియస్ గా తీసుకోవాలన్నారు. ఇప్పటి వరకు ఏ ఎన్నికలైనా మనమే గెలిచాం. రాష్ట్ర వ్యాప్తంగా 60 లక్షల మందికి పైగా సభ్యత్వం కలిగిన ఏకైక పార్టీ టీఆర్ఎస్ ఒక్కటే అని అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో సాదాబైనమా, పోడు భూములు విషయంలో వన్ టైం అనంతరం మంత్రి పువ్వాడ సమక్షంలో వివిధ పార్టీల నుంచి పలువురు టీఆర్ఎస్ లో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

కార్యక్రమంలో విప్ రేగా కాంతారావు రావు, ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జ్ భరత్ కుమార్, జడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, నాయకులు తెల్లం వెంకట్రావు, తాటి వెంకటేశ్వర్లు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్, తుళ్లూరు బ్రహ్మయ్య తదితరులు ఉన్నారు.

గల్లంతైన నవీన్ మృతదేహం లభ్యం

గాలింపులో అడ్డంకిగా మారిన బురద

హైదరాబాద్ నాలాల తీరుపై కొండా ఆందోళన

హైదరాబాద్,సెప్టెంబర్21(ఆర్ఎన్ఎ): సరూర్ నగర్ మినీ ట్యాంక్ బండ్‌లో గల్లంతైన నవీన్ కుమార్ మృత దేహం లభ్యమైంది. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు గంటల తరబడి గాలించి మృత దేహాన్ని బయటకు తీశారు. సరూర్ నగర్ చెరువు కట్ట నుంచి తపోవన్ కాలనీ వైపు వెళ్లే దారిలో వరద నీటిలో అల్మాస్‌గూడకి చెందిన నవీన్ కుమార్ కొట్టుకుపోయాడు. నాలా వద్ద ద్విచక్ర వాహనం మొరాయించడంతో వెనుక కూర్చున్న వ్యక్తి కిందికి దిగి దాన్ని తోసేందుకు ప్రయత్నించాడు. ఒక్కసారిగా వరద ఉధృతి పెరిగింది. దీంతో అందరూ చూస్తుండగానే నవీన్ కొట్టుకుపోయాడు. నవీన్ కుమార్ ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. నవీన్‌కు భార్య, ఇద్దరు పిల్లున్నారు. నవీన్ కోసం బృందాలు ఉదయం నుంచి గాలించి చివరకు మృతదేహాన్ని గుర్తించారు. బురద పేరుకుపోవడంతో గాలింపు చర్యలకు అంతరాయం ఏర్పడింది. వర్షం పడితే నీళు పడక.. నిప్పులు పడుతాయా అంటూ .ఇటీవల ఓ మంత్రి చేసిన వ్యాఖ్యలు బాధాకరమని మాజీ ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ హైదరాబాద్‌ను దల్లాస్ చేస్తాం.. సింగపూర్ చేస్తామన్నారు. మాకవేవీ వద్దు.. నగరాన్ని మంచిగా పెట్టండి అది చాలని విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. నవీన్ కుటుంబానికి రూ.50 లక్షలు, ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలన్నారు. వరదలు వస్తే నగరం మునిగిపోవే పరిస్థితి ఎందుకు వచ్చిందో చెప్పాలన్నారు. దీనిని బాగు చేయొద్దని ఎవరైనా అడ్డుకోవడం లేదు కదా అని అన్నారు. నాలాల వల్ల ఇద్దరు మృతి చెందడం బాధాకరమన్నారు.

ధరణి పోర్టల్‌పై నేడు సిఎం కెసిఆర్ సమీక్ష

పూర్తి వివరాలతో రావాలని అధికారులకు ఆదేశాలు

హైదరాబాద్,సెప్టెంబర్21(ఆర్ఎన్ఎ): నూతన రెవెన్యూ చట్టంలో భాగంగా తీసుకువస్తున్న ధరణి పోర్టల్‌పై ముఖ్యమంత్రి కేసీఆర్ మంగళవారం సమీక్ష నిర్వహించనున్నారు. ధరణి పోర్టల్ రూపకల్పనపై మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రగతి భవన్‌లో ఉన్నతాధికారులతో ఉన్నత స్థాయి సమావేశం జరగనుంది. ఈ పోర్టల్ రూపకల్పనకు సమగ్ర సమాచారంతో రావాలని అధికారులను సీఎం ఆదేశించారు. రెవెన్యూ సంస్కరణల్లో భాగంగా రెవెన్యూ రికార్డులను పారదర్శకంగా నిర్వహించడానికి ధరణి పోర్టల్ రూపకల్పన జరగాలని సీఎం కేసీఆర్ ఆకాంక్షించారు. ఇప్పటికే రెవెన్యూ బిల్లు ఆమోదం పొందడంతో పాటు ధరణిలో అన్ని వివరాలు నమోదు చేస్తామని సీఎం ప్రకటించారు. దీంతో ధరణికి సంబంధించిన అంశాలను కెసిఆర్ సమగ్రంగా చర్చించనున్నారు.

పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం మాదే: పల్లా

యాదాద్రి భువనగిరి,సెప్టెంబర్21 (ఆర్ఎన్ఎ): నల్లగొండ ,ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎన్నికల్లో టీఆర్ఎస్ విజయదుందుభి మోగించడం ఖాయమని రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం జయశ్రీ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఎన్నో అద్భుత పథకాలకు శ్రీకారం చుట్టారని కొనియాడారు. రైతుల సంక్షేమమే పరమావధిగా ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే ప్రభుత్వ అనుబంధ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు.

కరోనా లాంటి విపత్కర సమయంలోనూ రైతుబంధు డబ్బులు విడుదల చేసిన ఘనత సీఎం కేసీఆర్ కే దక్కుతుందన్నారు. గ్రామాల్లోని పట్టభద్రులను గుర్తించి వారిని ఓటర్లుగా నమోదు చేయించాలని పేర్కొన్నారు. ప్రతి ఓటర్ ని కలిసి టిఆర్ఎస్ కే ఓటు వేయించాలని అభ్యర్థించాలని తెలిపారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, ఎంపీపీ వెంకట్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ దావోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అందుబాటులో అధునాతన లైబ్రరీలు

ఉప్పల్‌లో శంకుస్థాపన చేసిన మంత్రులు

హైదరాబాద్,సెప్టెంబర్21 (ఆర్ఎన్ఎ): సీఎం కేసీఆర్ నిర్ణయం మేరకు విద్యార్థులు, యువతలో పుస్తక పఠన శక్తి పెరిగేలా ఆధునిక సదుపాయాలు, టెక్నాలజీతో గ్రంథాలయాలు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి సబితా ఇం